ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
శనివారం 3 ఆగస్టు 2024



సమర్థవంతంగా పనిచేయాలి: కలెక్టర్

పార్వతీపురం, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): మండలాల్లో తహసీల్దార్లు సమర్థవంతంగా పనిచేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో తహసీల్దార్లతో సమీక్షించారు. రెవెన్యూ అంశాలపై స్పందించి బాధితులకు పరిష్కార మార్గం చూపాలన్నారు. రికార్డులను పక్కాగా నిర్వహించాలని ప్రజల సమస్యలు మండల స్థాయిలోనే పరిష్కారం కావాలని సూచించారు. విపత్తులు, ఇతర సమస్యలను ముందుగా గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని, ఆర్‌వోఎఫ్ఆర్, భూసేకరణ, గృహ నిర్మాణంపై దృష్టిసారించాలని ఆదేశించారు. సమావేశంలో జేసీ శోభిక, ఇన్‌చార్జి డీఆర్వో కేశవనాయుడు, ఆర్డీవోలు పాల్గొన్నారు.

ప్రజల్లోకి వస్తే.. నిలదీస్తారనా?



- ఎన్నికల్లో ఓటమి తర్వాత వైసీపీ నేతల్లో నిస్తేజం
- ఇళ్లకే పరిమితమవుతున్న మాజీ ఎమ్మెల్యేలు
- ప్రజాక్షేత్రంలోకి వస్తే ప్రశ్నిస్తారని భయం
- ఐదేళ్లూ అరాచకాలు, దందాలు నడిపిన వైనం



(పార్వతీపురం- ఆంధ్రజ్యోతి)

అధికారం ఉంది కదా అని రెచ్చిపోయారు.. తమని అడిగే వారెవరిని ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. పార్టీలోని సెకండ్ క్యాడర్‌కు కూడా అవకాశం ఇవ్వలేదు.. అన్నీ తామే అన్నట్లుగా నడుచుకున్నారు. నోటికొచ్చినట్లు మాట్లాడారు. ఘాటైన విమర్శలతో చెలరేగిపోయారు. కొన్నిచోట్ల ప్రతిపక్ష పార్టీల నాయకులపై అక్రమ కేసులు బనాయించారు. రౌడీషీట్ ఓపెన్ చేయించి ఆనందం పొందారు. ప్రశ్నించే వారిపై దాడులకు పాల్పడ్డారు. ఇలా గత ఐదేళ్లు వైసీపీ నాయకులు, కార్యకర్తలు బరితెగించి వ్యవహరించారు. అయితే ఆ ప్రభావం మొన్న ఎన్నికల్లో వైసీపీ నేతలపై పడింది. ఊహించని రీతిలో వైసీపీని ప్రజలు ఓడించారు. ఎన్డీయే కూటమిని భారీ మెజార్టీతో గెలిపించారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీ శ్రేణుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. వారిని పట్టించుకున్న వారే కరువయ్యారు. గత ఐదేళ్లూ విర్రవీగిన వైసీపీ నేతలు నిస్తేజంలోకి వెళ్లిపోయారు. కొన్ని నియోజకవర్గాల్లో మాజీ ఎమ్మెల్యేలు ప్రజల్లోకి వెళ్లలేక.. ఇళ్లకే పరిమితమయ్యారు. మరో ఇద్దరు మాజీ ఎమ్మెల్యేల అడ్రస్ లేకుండా పోయిందని ఆయా ప్రాంతాల్లో వైసీపీ నేతలే చెబుతున్నారు. జిల్లాలో నాలుగునియోజక వర్గాల్లో పరిస్థితిని పరిశీలిస్తే..

కురుపాంలో..



కురుపాం నియోజకవర్గంలో మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి కూడా ఎన్నికల ఫలితాల తర్వాత ఇంటికే పరిమితమయ్యారని చెప్పొచ్చు. అప్పుడప్పుడు ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ పత్రికా ప్రకటనలు జారీ చేస్తున్నారు.. తప్ప ప్రజల్లోకి వెళ్లిన పరిస్థితి లేదు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు బంధువులకు కాంట్రాక్ట్ పనులు ఇవ్వడంతో పాటు ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలపై ఇష్టా రాజ్యంగా కేసులు నమోదు చేయించారనే ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు పోలీసుల ద్వారా టీడీపీ నాయకులను అనేక ఇబ్బందులకు గురిచేశారు. ఆ నియోజకవర్గానికి చెందిన మాజీ ఏఎంసీ ఛైర్మన్ డొంకాడ రామకృష్ణపై ఏకంగా రౌడీ షీట్ ఓపెన్ చేయించారు.

పార్వతీపురంలో..



గత వైసీపీ సర్కారు పాలనలో పార్వతీపురం ఎమ్మెల్యేగా ఉన్న అలజంగి జోగారావు స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులకు ఎలాంటి గౌరవం ఇవ్వలేదు. అంతా తానే అన్నట్లుగా వ్యవహరించారు. భూ ఆక్రమణలకు సంబంధించి ఆయనపై ఎన్నో ఆరోపణలున్నాయి. ప్రభుత్వ భూములను 22ఏ నుంచి తప్పించి.. కారుచౌకగా కొనుగోలు చేశారనే వ్యాఖ్యలు గట్టిగా విని పిస్తున్నాయి. ఎమ్మెల్యే అనుచరులుగా చెప్పుకునే కొందరు పార్వతీపురం పట్టణంలో చెరువులను కబ్జా చేసి.. వేరొకరికి విక్రయించినట్లు తెలుస్తోంది. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా.. జోగారావు తన ఇంటిలోనే వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. దీన్ని అడ్డుకున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రస్తుత ఎమ్మెల్యే విజయచంద్రపైన వైసీపీ నేతలే దౌర్జన్యం చేసి.. మళ్లీ వారిపైనే పోలీసు కేసులు పెట్టించారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్నికలప్పుడు ఇక్కడికి వచ్చినప్పుడు భూదందాలపై విరుచుకుపడ్డారు. ఈ ఎన్నికల్లో జోగారావు ఓడిపోయిన తర్వాత పూర్తిగా ఇంటికే పరిమితమయ్యారు. ఇంతరకు ప్రజా క్షేత్రంలో ఎక్కడా కనిపించలేదు. టీడీపీ కూటమి ప్రభుత్వాన్ని విమర్శిస్తూ.. ఇంటి నుంచే పత్రిక ప్రకటనలు విడుదల చేస్తున్నారు.

పాలకొండలో..



పాలకొండ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే విశ్వసరాయి కళావతి ఇంటికే పరిమితం అయ్యారు. కనీసం పత్రికా ప్రకటనలు కూడా ఇవ్వడం లేదు. గత ఐదేళ్లూ.. వైసీపీ సర్కారు పాలనలో అన్నీతానై వ్యవహరించిన ఆమె ప్రస్తుతం ఇంటికే పరిమితం కావడం సర్వత్రా చర్చ నీయాంశ మవుతోంది. కళావతి పదవిలో ఉండగా.. గిరిజనుల భూములను కారు చౌకగా కొనుగోలు చేసుకుని ఫాంహౌస్ నిర్మించుకున్నట్లు ఆరోపణలు న్నాయి. అంతేగాకుండా ప్రభుత్వ నిధులతో ఫాంహౌస్‌కు మరో గిరిజన గ్రామం పేరు చెప్పి.. బీటీ రహదారి నిర్మించుకున్నా రనే వ్యాఖ్యలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. పాలకొండలో ఆమె అనుచరులుగా ముద్రపడిన అనేక మంది భూములు, ఇళ్ల స్థలాలు, చెరువులు ఆక్రమించారు. ఇసుక దందా నిర్వహించారు. జగనన్న కాలనీలకు సంబంధించి భూ సేకరణ విషయంలో ఎక్కువ ధరకు భూములు కొనుగోలు చేసి.. అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

సాలూరులో..



సాలూరు మాజీ ఎమ్మెల్యే, మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర కూడా తన ఇంటి వద్దే ప్రెస్‌మీట్‌లు పెట్టి.. తరచూ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ప్రకటనలు చేస్తున్నారు. ప్రస్తుత జడ్పీ ఛైర్మన్ చిన్నశ్రీనుపై ఆధారపడి రాజన్నదొర పాలన సాగించారని ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ యువనేత నారా లోకేశ్ ఆరోపించారు. ఏదేమైనా గత ఐదేళల్లో నియోజకవర్గంలో చక్రం తిప్పిన వైసీపీ ఎమ్మెల్యేలు, వారి అనుచరులు నేడు పూర్తిగా ఇళ్లకే పరిమితమయ్యారని చెప్పొచ్చు.

ఐదు కిలోమీటర్లు.. మూడు రైల్వేగేట్లు

- ఉమ్మడి జిల్లా, ఏవోబీ వాసులకు తప్పని ఇబ్బందులు
- నిత్యం గంటల కొద్దీ నిరీక్షణ
- లోక్‌సభలో గళం విప్పిన ఎంపీ అప్పలనాయుడు
- దీర్ఘకాలిక సమస్యకు మోక్షం లభిస్తుందని జిల్లావాసుల్లో ఆశ

పార్వతీపురం, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కొమరాడ మండలంలో అర్తం, సోమినాయుడువలస, కోటిపాము గ్రామాల మధ్య కేవలం ఐదు కిలోమీటర్ల దూరంలో మూడు రైల్వే గేట్లు ఉండడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. వాహనదారులు, ప్రయాణికులు నిత్యం నరకం చూస్తున్నారు. ఆంధ్ర-ఒడిశా మధ్య రాకపోకలు సాగించే వారు కూడా నానా అవస్థలు పడుతున్నారు. ఒకసారి గేటు పడితేనే.. కనీసం 15 నుంచి 20 నిమిషాల వరకు వేచి ఉండాల్సిన పరిస్థితి. ఒక్కోసారి రెండు రైళ్ల రాకపోకలు సాగించే సందర్భంలో డబుల్ గేట్ పడితే.. 30 నుంచి 50 నిమిషాల వరకు నిరీక్షణ తప్పదు. ఈ విధంగా ఒక గేటు తప్పించుకునే క్రమంలో మరో గేటు వద్ద ఈ పరిస్థితి ఎదురవడంతో ఉమ్మడి జిల్లా వాసులతో పాటు ఆంధ్ర-ఒడిశా ప్రజలు తీవ్ర ఇక్కట్లపాల వుతున్నారు. నిత్యం ఇరు రాష్ట్రాలకు చెందిన వాహనాలు, బస్సులతో పాటు ఒడిశా రాష్ట్రం రాయగడలో మజ్జిగౌరి దేవాలయానికి పార్వతీపురం, విజయనగరం, విశాఖకు చెందిన భక్తులు కూడా భారీగా వెళ్తుంటారు. వందలాది వాహనాలతో ఈ మార్గం రద్దీగా ఉంటుంది. అయితే రైల్వే గేట్ల వద్ద వారికి గంటలకొద్దీ నిరీక్షణ తప్పడం లేదు. దీర్ఘకాలికంగా ఈ సమస్య వేధిస్తున్నా.. రైల్వేశాఖ పట్టించుకోవడం లేదు. వాస్తవంగా మూడు రైల్వేగేట్లు కలుపుకొని.. ఒక వంతెన నిర్మించేందుకు గతంలో రైల్వేశాఖ సర్వే చేసినట్టుగా వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. అయితే ఆ సర్వే ఎప్పుడు జరిగింది.. ఎవరు చేపట్టారు? అన్నది మాత్రం తెలియడం లేదు. గత ఐదేళ్లలో వైసీపీ ఎంపీలు కూడా ఈ సమస్యపై దృష్టి సారించ లేదు. అయితే దీనిపై విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు స్పందించారు. ఇటీవల పార్లమెంట్‌లో ఈ అంశాన్ని ప్రస్తావించారు. మూడు రైల్వేగేట్ల కారణంగా ప్రజలు, వాహనదారులతో పాటు ఒడిశా రాష్ట్రంలో రాయగడ మజ్జిగౌరి దేవాలయానికి వెళ్లే భక్తుల ఇబ్బందులను సభ దృష్టికి తీసుకొచ్చారు. రైల్వేశాఖ మంత్రి తగు చర్యలు తీసుకోనున్నట్లుగా ఎంపీ తెలిపారు. దీంతో త్వరలో ఈ సమస్యకు మోక్షం కలగనుందని జిల్లావాసులు భావిస్తున్నారు.



కొమరాడ మండలం అర్తం వద్ద రైల్వేగేటు ఇలా..


తహసీల్దార్ బదిలీల్లో మార్పులు

- ఉత్తర్వులు జారీ చేసిన ఉన్నతాధికారులు



పార్వతీపురం, ఆగస్టు2 (ఆంధ్రజ్యోతి)/ గుమ్మలక్ష్మీపురం/ గరుగుబిల్లి/ సీతంపేట రూరల్/ కురుపాం : ఎన్నికల విధుల్లో భాగంగా ఇతర జిల్లాలకు వెళ్లిన తహసీల్దార్లు ఇటీవల సొంత జిల్లాకు వచ్చారు. ఈ మేరకు కలెక్టర్ వారికి మండలాలు కేటాయించారు. కొందరు బాధ్యతలు కూడా స్వీకరించారు. అయితే విధులు స్వీకరించిన రెండు రోజులకే బదిలీల్లో కొన్ని మార్పులు, చేర్పులు చేశారు. గరుగుబిల్లి తహసీల్దార్‌గా నియామకమైన ఎం.భుజంగ రావును పార్వతీపురం ఆర్డీవో కార్యాలయ డీఏవోగా నియమించారు. గతంలో ఆయన కొమరాడలో తహసీల్దార్‌గా పనిచేశారు. అయితే బాధ్యతలు చేపట్టిన రెండు రోజులకే బదిలీ చేశారు. గురుగుబిల్లి ఉప తహసీల్దార్ పి.సత్యలక్ష్మికుమార్‌ను తొలుత కలెక్టరేట్‌లో సీసీగా నియమించారు. కాగా ప్రస్తుతం అయన్ని ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. భామిని తహసీల్దార్‌గా నియమించిన పి.సోమేశ్వరరావును పార్వతీపురానికి బదిలీ చేశారు. సీతంపేట నుంచి గుమ్మలక్ష్మీపురానికి ఎస్.అప్పారావును, సీతానగరం నుంచి సీతంపేటకు అప్పలరాజు, కొమరాడ నుంచి సీతానగరానికి రాములమ్మ, బలిజిపేట నుంచి భామినికి ఆర్.ఉమామహేశ్వరరావు, గుమ్మలక్ష్మీపురం నుంచి కొమరాడకు రమేష్‌కుమార్, పార్వతీపురం నుంచి బలిజిపేటకు జనార్ధన్‌ను బదిలీ చేశారు.

15 నెలలుగా అందట్లే..!



- వేతనాల కోసం ఎదురుచూస్తున్న పంచాయతీరాజ్ టెక్నికల్ అసిస్టెంట్లు
- గత వైసీపీ సర్కారు తీరుతో ఇక్కట్లు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

గరుగుబిల్లి, ఆగస్టు 2: జిల్లాలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న టెక్నికల్ అసిస్టెంట్ల పరిస్థితి దయనీయంగా మారింది. గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో 32 మందికి పైగా టీఏలకు గత 15 నెలలుగా జీతాలు అందడం లేదు. దీంతో వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కుటుంబ పోషణ కష్టతరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపైనే వారు ఆశలు పెట్టుకున్నారు. వాస్తవంగా 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా కొంతమంది సైట్ ఇంజనీర్లు, టెక్నికల్ అసిస్టెంట్లను నియమించారు. గతంలో ఏపీసీవోఎస్ (ఆప్కాస్) నుంచి వారికి వేతనాలు అందేవి. అయితే గత వైసీపీ ప్రభుత్వం వేతనాలు చెల్లించకుండా తీవ్ర జాప్యం చేసింది. టెక్నికల్ అసిస్టెంట్లు, సైట్ ఇంజనీర్లకు పరిపాలనా నిధుల్లో 3 శాతం వేతనాల కింద చెల్లించాలని నిబంధనలు పెట్టింది. కాగా గత ఐదేళ్లలో 3 శాతం నిధులు సక్రమంగా మంజూరు కాకపోవడంతో వారు సీఎం కార్యాలయానికి వెళ్లారు. అయితే 'టీడీపీకి చెందిన వారే అధికంగా ఉన్నారని, మీ అవసరం మాకు లేదు' అని అక్కడి సిబ్బంది చెప్ప డంతో వారంతా ఆశ్చర్యపోయారు. ఏం చేయాలో తెలియక తలలు పట్టుకున్నారు.

కక్ష కట్టిన వైసీపీ సర్కారు..

టీఏలుగా విధులు నిర్వహిస్తున్న వారికి అర్హత మేరకు సచివాలయ పరిధిలోనే ఇంజనీరింగ్ అసి స్టెంట్లుగా నియమించాలని కొంతమంది సిబ్బంది ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. రాష్ట్ర వ్యాప్తంగా 400 మందికి గాను 216 మంది కోర్టుకు వెళ్లారు. నిబంధనల మేరకు నియ మించాలని కోరారు. అయితే దీనిని తట్టుకోలేక పోయిన వైసీపీ ప్రభుత్వం వారిపై కక్ష కట్టింది. నియామకాలు చేపట్టకపోగా.. వారిని విధుల నుంచి తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో టీఏలు కోర్టుకు వెళ్లారు. న్యాయస్థానం అనుకూల తీర్పుతో వారు విధులు నిర్వహి స్తున్నారు. కానీ వైసీపీ సర్కారు కొన్ని నెలలుగా వారి వేతనాలు చెల్లించడం లేదు. ఇదిలా ఉండగా విధులు నిర్వహిస్తున్న టీఏలకు గత రెండేళ్లుగా ఈఎస్ఐ, ఈపీఎఫ్‌కు సంబంధించి వాటాను ఆప్కాస్‌కు చెల్లించడం లేదు. పంచా యతీరాజ్ శాఖకు టీఏలు అవసరమని 2023, ఫిబ్రవరిలో ప్రత్యేక కమిటీ చేసిన సిఫారసులను సైతం గత ప్రభుత్వం పక్కకు పెట్టింది.

వీరి బాధ్యతలు ఇవే..

పంచాయతీలు, మండలాల పరిధిలో రహదారులు, సీసీ కాలువలు, ప్రభుత్వ భవనాలకు సంబంధించి ఎస్టిమేట్లు, నిర్మాణాల తర్వాత బిల్లులు తయారీతో పాటు నాణ్యతా ప్రమాణాల పరిశీలన, పర్యవేక్షణ బాధ్యతలను గతంలో నియామకమైన టెక్నికల్ అసిస్టెంట్లకు అప్పగించారు. నెలకు రూ.18,500 వేతనంగా నిర్ణయించారు. కాగా పరిశీలనకు కొంతమేర ఖర్చులవగా.. చాలీచాలని వేతనాలతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే ఆ వేతనాలను కూడా గత ప్రభు త్వం సక్రమంగా చెల్లించలేదని టీఏలు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఆర్థిక ఇబ్బందులను భరించలేక.. విజయనగరం జిల్లా చీపురుపల్లి సబ్ డివిజనల్‌కు సంబంధించి టీఏ పి.సాయిరామ్ మృతి చెందారని వారు వాపోతున్నారు.

మంత్రుల దృష్టికి సమస్యలు

కొద్ది రోజుల కిందట వారు రాష్ట్ర మంత్రులు నారా లోకేష్, కె.పవన్‌కల్యాణ్, కె. అచ్చెన్నాయుడు, కె.శ్రీనివాసరావు, జి.సంధ్యా రాణి, ప్రిన్సిపాల్ కార్యదర్శి ఇంజనీరింగ్ ఇన్ చీఫ్‌లను కలిసి వినతిపత్రాలను అందించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎదుర్కొన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు వేతనాలను పూర్తి స్థాయిలో అందించాలని కోరారు. పలు విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి 300/302 హెడ్ ఆఫ్ అకౌంట్ ద్వారా జీతాలు చెల్లించాలని, శాశ్వత ఉద్యోగ భద్రతకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మొత్తంగా వేతన సమస్యతో పాటు విధుల నిర్వహణపై కూటమి నేతలపైనే వారు ఆశలు పెట్టుకున్నారు.

ఆదుకోవాలి..

పంచాయతీరాజ్ శాఖకు సిబ్బంది అవసరం అని 2023, ఫిబ్రవరిలో ప్రత్యేక కమిటీ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు అర్హత ఉన్న వారిని ఇంజనీరింగ్ అసిస్టెంట్లుగా నియమించాలి. కోర్టు ఆదేశాల మేరకు విధుల్లో కొనసాగించాలి. నిబంధనల మేరకు ఖాళీగా ఉన్న పోస్టుల్లో ఏఈఈలు, జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్లుగా నియమించాలి. కూటమి ప్రభుత్వమే ఆదుకోవాలి.

- ఎన్.రాజా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఆదేశాలు రాలేదు..

పంచాయతీరాజ్ శాఖలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని తొలగించాలని గత వైసీపీ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. అయితే దీనిపై ప్రస్తుత టీడీపీ కూటమి సర్కారు ఆలోచించాల్సి ఉంది. ఇప్పటివరకైతే ఎటువంటి ఆదేశాలు రాలేదు. టీఏలకు 15 నెలలుగా వేతనాలు చెల్లించలేదు. వారికి 3 శాతం పరిపాలనా నిధులు నుంచి జీతాలు చెల్లించాలి. అయితే పరిపాలనా నిధులు మంజూరు కాలేదు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. ఆదేశాలు అందిన వెంటనే నిబంధనల మేరకు వారికి బకాయిలు చెల్లిస్తాం.

- ఎంవీఆర్ కృష్ణాజీ, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ఇంజనీర్



మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం ఇస్తున్న టీఏలు (ఫైల్)

గురండిలో డెంగ్యూ

- అప్రమత్తమైన అధికారులు, వైద్య సిబ్బంది
- గ్రామస్థులకు ఆరోగ్య పరీక్షలు
- పారిశుధ్య పనులు, స్ప్రేయింగ్ నిర్వహణ
- జాగ్రత్తలు తీసుకోవాలని సూచన

భామిని: భామిని మండలం గురండిలో డెంగ్యూ కేసు నమోదైంది. దీంతో వైద్య సిబ్బంది, అధికారులు అప్రమత్తమయ్యారు. కొద్దిరోజుల కిందట ఆ గ్రామంలో వైద్య సిబ్బంది ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరుగురికి వైరల్ ఫీవర్ ఉన్నట్లు గుర్తించి రక్తపూతలు సేకరించారు. అయితే వారిలో సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధిగ్రస్థుడైన ఓ బాలుడు జ్వరం తగ్గకపోవడంతో భామిని పీహెచ్‌సీకి వెళ్లాడు. అక్కడ రక్త పరీక్షలు చేయగా ఎన్ఎస్-వన్ పాజిటివ్ అని తేలింది. దీంతో బాలుడిని సీతంపేట ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేశారు. సికిల్‌సెల్ పేషెంట్ కావడంతో మెరుగైన చికిత్స కోసం అక్కడ నుంచి రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం అక్కడ బాలుడు చికిత్స పొందుతున్నాడు. కాగా వైద్య సిబ్బంది శుక్రవారం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. పలువురి ఆరోగ్య పరీక్షలు చేశారు. జ్వర లక్షణాలతో బాధపడుతున్న వారి రక్తపూతలు సేకరించారు. మరోవైపు అధికారులు ఇంటింటికీ స్ప్రేయింగ్, క్లోరినేషన్ చేయించారు. కాలువల్లో పూడికలు తీయించారు. జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో కిషోర్‌కుమార్ సూచించారు. ఈ శిబిరంలో వైద్యాధికారి సంతోషి లక్ష్మి, సీహెచ్‌వో భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి అనసూయ పాల్గొన్నారు.



గురండిలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

యూఓహెచ్‌లో ఇంటిగ్రేటెడ్ పీజీ



యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్(యూఓహెచ్-సెంట్రల్ యూనివర్సిటీ)- ఇంటిగ్రేటెడ్ పీజీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. ఆరేళ్ల మాస్టర్ ఆఫ్ ఆప్టోమెట్రీ, నాలుగేళ్ల బీఎస్ ఆనర్స్/రీసెర్చ్ ప్రోగ్రామ్‌లు కూడా ఉన్నాయి. సీయూఈటీ(యూజీ) 2024 స్కోర్, కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. మొత్తం 440 సీట్లు ఉన్నాయి.

స్పెషలైజేషన్‌లు-సీట్లు

- **ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ:** మేథమెటికల్ సైన్స్ 40, ఫిజిక్స్ 40, కెమిస్ట్రీ 20, బయాలజీ 60, అప్లయిడ్ జియాలజీ 18, సైకాలజీ 20 సీట్లు ఉన్నాయి.
- **ఇంటిగ్రేటెడ్ ఎంఏ:** తెలుగు 19, హిందీ 20, లాంగ్వేజ్ సైన్సెస్ 19, ఉర్దూ 14, ఎకనామిక్స్ 17, హిస్టరీ 35, పొలిటికల్ సైన్స్ 25, సోషియాలజీ 25, ఆంత్రోపాలజీ 20 సీట్లు ఉన్నాయి.
- మాస్టర్ ఆఫ్ ఆప్టోమెట్రీలో 28 సీట్లు ఉన్నాయి.
- బీఎస్ ఆనర్స్/రీసెర్చ్: కెమిస్ట్రీ స్పెషలైజేషన్‌లో 20 సీట్లు ఉన్నాయి.

అర్హత: ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కోర్సులో ప్రవేశానికి స్పెషలైజేషన్‌ను అనుసరించి ఇంటర్(ఎంపీసీ/బైపీసీ) ఉత్తీర్ణులై ఉండాలి. ఇంటిగ్రేటెడ్ ఎంఏలో ప్రవేశానికి ఏదేని గ్రూప్‌తో ఇంటర్ పూర్తిచేసి ఉండాలి. లాంగ్వేజ్ స్పెషలైజేషన్‌లకు మాత్రం ఆ లాంగ్వేజ్‌లు ఒక సబ్జెక్ట్‌గా చదివుండాలి. లేదంటే ఓరియంటల్ ఎగ్జామినేషన్(తెలుగు/హిందీ/ఉర్దూ) ఉత్తీర్ణులై ఉండాలి. తెలుగు స్పెషలైజేషన్‌ను ఎంచుకున్న అభ్యర్థులు పదోతరగతిలో ఫస్ట్ లాంగ్వేజ్‌గా తెలుగు చదివుండాలి. బీఎస్ ఆనర్స్/రీసెర్చ్ ప్రోగ్రామ్‌నకు కెమిస్ట్రీ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. మాస్టర్ ఆఫ్ ఆప్టోమెట్రీ కోర్సులో ప్రవేశానికి ఇంటర్(సైన్స్) ఉత్తీర్ణులు అర్హులు. అభ్యర్థులందరికీ ఇంటర్ స్థాయిలో ప్రథమ శ్రేణి మార్కులు ఉండాలి. సీయూఈటీ(యూజీ) 2024 అర్హత తప్పనిసరి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 15
- **కౌన్సెలింగ్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** ఆగస్టు 22
- **ఫిజికల్ రిపోర్టింగ్, అడ్మిషన్ కౌన్సెలింగ్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్:** ఆగస్టు 30, 31
- **తరగతులు ప్రారంభం:** సెప్టెంబరు 2 నుంచి
- **వెబ్‌సైట్:** http://acad.uohyd.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/z94oKavలో చదవండి.

దిక్సూచి DIKSUCHI

అంబేద్కర్ యూనివర్సిటీలో పీజీ, పీజీ డిప్లొమా

శ్రీకాకుళంలోని డా.బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ(బీఆర్ఏయూ)- మాస్టర్ ఆఫ్ హెల్త్‌కేర్ అడ్మినిస్ట్రేషన్(ఎంహెచ్ఏ), పీజీ డిప్లొమా ఇన్ మెడికల్ రికార్డ్స్ అండ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఎంహెచ్ఏ వ్యవధి రెండేళ్లు. పీజీ డిప్లొమా వ్యవధి ఏడాది. ఒక్కో ప్రోగ్రామ్‌లో 40 సీట్లు ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్‌లకు ఆదిత్య ఎడ్యుకేషనల్ సొసైటీకి చెందిన బొల్లినేని మెడ్‌స్కిల్స్ సహకారం అందిస్తోంది. థియరీ తరగతులతోపాటు ప్రాక్టికల్స్ కూడా ఉంటాయి.

అర్హత: ఎంబీబీఎస్/బీడీఎస్/బీఎస్సీ/బీఫార్మసీ/బీఎస్సీ నర్సింగ్/బీఏఎంఎస్/ బీహెచ్ఎంఎస్/బీఎస్సీ/బీకాం/బీఏ/ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 20 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.

- **క్యాంపస్ సెంటర్:** బొల్లినేని మెడ్‌స్కిల్స్, జెమ్స్ అండ్ హాస్పిటల్ క్యాంపస్, రాగోలు, శ్రీకాకుళం-532484



- **దరఖాస్తు ఫీజు:** రూ.250
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** ఆగస్టు 30
- **వెబ్‌సైట్:** www.brau.edu.in, www.bollinenimed-skills.in

జేఎన్‌టీయూకేలో ఎంబీఏ, ఎంసీఏ

కాకినాడలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూకే)-స్పాన్సర్డ్ కేటగిరీ కింద ఎంబీఏ, ఎంసీఏ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. అకడమిక్ మెరిట్, ఐసెట్ 2024 ర్యాంక్, అనుభవం, కౌన్సెలింగ్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఒక్కో ప్రోగ్రామ్‌లో తొమ్మిది సీట్లు ఉన్నాయి. ఎంసీఏ ప్రోగ్రామ్‌ను కాకినాడలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్(యూసీఈకే)లో, ఎంబీఏ ప్రోగ్రామ్‌ను జేఎన్‌టీయూకేకు చెందిన స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్(ఎస్ఎంఎస్)లో నిర్వహిస్తారు. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు స్కాలర్‌షిప్‌లు, స్టయిపెండ్ లభించవు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి కనీసం 50 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎంసీఏ ప్రోగ్రామ్‌నకు మాత్రం డిగ్రీ/ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. రెండు ప్రోగ్రామ్‌లకూ ఐసెట్ 2024 అర్హత తప్పనిసరి. కనీసం ఏడాది ప్రొఫెషనల్ అనుభవం ఉండాలి.

- **చివరి తేదీ:** ఆగస్టు 14
- **వెబ్‌సైట్:** www.jntuk.edu.in

ప్రభుత్వ బ్యాంకుల్లో స్పెషలిస్ట్ ఆఫీసర్లు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలెక్షన్(ఐబీపీఎస్).. వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో స్పెషలిస్ట్ ఆఫీసర్స్(సీఆర్‌పీ ఎస్‌పీఎల్-గీఐ౫) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. మూడు దశల ఎంపిక విధానం ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

896 ఖాళీలు

1. ఐటీ ఆఫీసర్(స్కేల్-1): 170 పోస్టులు
2. అగ్రికల్చరల్ ఫీల్డ్ ఆఫీసర్(స్కేల్-1): 346
3. రాజ్‌భాష అధికారి(స్కేల్-1): 25
4. లా ఆఫీసర్ స్కేల్-1): 125
5. హెచ్ఆర్/పర్సనల్ ఆఫీసర్(స్కేల్-1): 25
6. మార్కెటింగ్ ఆఫీసర్(స్కేల్-1): 205

అర్హతలు: పోస్టును అనుసరించి బీఈ, బీటెక్(కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ అప్లికేషన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్). డిగ్రీ(అగ్రికల్చర్/హార్టికల్చర్/యానిమల్ హస్బెండరీ/వెటర్నరీ సైన్స్/డెయిరీ సైన్స్/ఫిషరీ సైన్స్/పిసికల్చర్/అగ్రి.మార్కెటింగ్ అండ్ కో ఆపరేషన్/కో- ఆపరేషన్ అండ్ బ్యాంకింగ్/ఆగ్రో ఫారెస్ట్రీ/అగ్రికల్చరల్ బయోటెక్నాలజీ/ఫుడ్ సైన్స్/అగ్రికల్చర్ టెక్నాలజీ బిజినెస్ మేనేజ్‌మెంట్/డెయిరీ టెక్నాలజీ/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్/సెరికల్చర్/ఫిషరీస్ ఇంజనీరింగ్). పీజీ(ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/కంప్యూటర్ అప్లికేషన్స్). పీజీ(హిందీ/సంస్కృతం). డిగ్రీ(ఎల్ఎల్‌బీ), పీజీ డిప్లొమా(పర్సనల్ మేనేజ్‌మెంట్/ఇండస్ట్రియల్ రిలేషన్స్/హెచ్ఆర్/హెచ్ఆర్‌డీ/సోషల్ వర్క్/లేబర్ లా). ఎంఎంఎస్(మార్కెటింగ్)/ఎంబీఏ(మార్కెటింగ్)/పీజీడీబీఏ/పీజీడీబీఎం/పీజీపీఎం/పీజీడీఎం.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 21
- **వెబ్‌సైట్:** https://www.ibps.in/

నవ్య | చిత్రజ్యోతి

చిరంజీవి కన్నా విజయ్ మంచి డాన్సర్!



హీరోయిన్ కీర్తిసురేశ్ వివాదంలో చిక్కుకున్నారు. తను నటించిన 'రఘు తాత' చిత్రం ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఆమె ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. దక్షిణాదిన బెస్ట్ డాన్సర్స్ గురించి ప్రస్తావన తెచ్చిన యాంకర్ 'మీ దృష్టిలో బెస్ట్ డాన్సర్ ఎవరు?' అని కీర్తిని అడిగారు. చిరంజీవి, తమిళ హీరో విజయ్ పేర్లు సూచించి, ఆ ఇద్దరిలో ఎవరి డాన్స్ అంటే మీకిష్టం అని అడిగారు. కీర్తిసురేశ్ విజయ్ పేరును ఎంచుకున్నారు. దీనిపై కీర్తిని నెటిజన్లు ట్రోల్ చేస్తున్నారు. ఏ విధంగా చిరంజీవి కన్నా విజయ్ మంచి డాన్సరో చెప్పాలని ఆమెను ప్రశ్నిస్తున్నారు. నానీ కన్నా ధనుష్, ధనుష్ కన్నా అల్లు అర్జున్ బాగా డాన్స్ చేస్తారని ఆమె చెప్పారు. అలాగే అల్లు అర్జున్ కన్నా చిరంజీవి డాన్స్‌ను ఎక్కువ ఇష్టపడతాను అని కీర్తి తెలిపారు.



విభిన్నమైన లుక్‌లో విజయ్

'రౌడీ' అంటూ అభిమానులు ఆప్యాయంగా పిలుచుకునే హీరో విజయ్ దేవరకొండ నటిస్తున్న 12వ చిత్రం శరవేగంతో తయారవుతోంది. 'మళ్లీ రావా','జెర్సీ' చిత్రాల దర్శకుడు గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఈ సినిమాలో విభిన్న గెటప్‌లో కనిపిస్తున్న విజయ్ దేవరకొండ లుక్‌ను విడుదల చేశారు. ఈ సినిమా కోసం ఇటీవల శ్రీలంకలోని అందమైన ప్రదేశాల్లో జరిగిన షూటింగ్‌తో అరవై శాతం చిత్రం పూర్తయింది. ఈ చిత్రం టైటిల్, ఫస్ట్ లుక్‌ను ఈ నెల్లోనే ఆవిష్కరిస్తామనీ, వచ్చే ఏడాది మార్చి 28న సినిమాను విడుదల చేస్తామని నిర్మాతలు సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య చెప్పారు.



దేవరతో స్టెప్పులేసిన జాన్వీ

జూనియర్ ఎన్టీఆర్, బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ జంటగా నటిస్తున్న 'దేవర' చిత్రం కోసం ఇటీవల చిత్రీకరించిన మెలోడీ సాంగ్‌ను ఈ నెల 5న విడుదల చేయనున్నారు. జాన్వీతో ఎన్టీఆర్ రొమాంటిక్ మోడ్‌లో ఉన్న పోస్టర్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో జాన్వీ అందాలు కనువిందు చేస్తున్నాయి. 'పఠాన్', వార్, 'ఫైటర్' చిత్రాలలో వైరల్ స్టెప్స్‌కు పేరు పొందిన బాలీవుడ్ కొరియోగ్రాఫర్ బోస్కో మార్టిన్ ఈ పాటకు కొరియోగ్రఫీ అందించడం విశేషం. ఎన్టీఆర్ అసాధారణమైన స్టెప్స్‌తో ఈ సాంగ్ అందరినీ అలరిస్తుందని దర్శకుడు కొరటాల శివ చెప్పారు. సెప్టెంబర్ 27న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో 'దేవర పార్ట్ 1' ను విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాతలు మిక్కిలినేని సుధాకర్, కొసరాజు హరికృష్ణ చెప్పారు. కల్యాణ్‌రామ్ చిత్ర సమర్పకుడు.

కొత్తగా..

వేణు ఊడుగుల నిర్మాణంలో...

తరుణ్ భాస్కర్ హీరోగా




నటుడు, దర్శకుడు తరుణ్ భాస్కర్ హీరోగా కొత్త చిత్రం ఖరారైంది. వంశీరెడ్డి దొండపాటి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. దర్శకుడు వేణు ఊడుగుల, బూసం జగన్‌మోహన్‌రెడ్డితో కలసి నిర్మిస్తున్నారు. కొత్త తరహా కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కిస్తున్నాం, అక్టోబర్ 2 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తామని మేకర్స్ తెలిపారు.

నిర్మాణరంగంలోకి ముత్యాల సుబ్బయ్య



కుటుంబ ఇతివృత్తాలతో అద్భుత చిత్రాలను అందించి, అగ్ర హీరోలందరితోనూ పని చేసిన సీనియర్ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య ఇప్పుడు నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టారు. తన సమర్పణలో తనయుడు ముత్యాల అనంతకిశోర్ నిర్మాతగా ఓ సినిమా నిర్మించనున్నారు. ముత్యాల మూవీ మేకర్స్ పతాకంపై రూపుదిద్దుకొనే ఈ చిత్రంలో రచిత మహాలక్ష్మి, కమల్ కామరాజు ప్రధాన పాత్రధారులు. ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్న వి. శ్రీనివాస్ (సిప్పీ) ఈ సందర్భంగా మాట్లాడుతూ 'ఓ వైవిధ్య భరితమైన కథాంశంతో, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం ఉంటుంది' అని చెప్పారు. ఈ నెల 9న అన్నపూర్ణ స్టూడియోలో చిత్రం షూటింగ్ ప్రారంభమవుతుందని నిర్మాత ముత్యాల అనంతకిశోర్ చెప్పారు.

డేట్ మారింది



విజయ్ ఆంటోనీ హీరోగా నటించిన 'తుపాన్' చిత్రం ఈ శుక్రవారం విడుదల కావాలి. అయితే కొన్ని కారణాల వల్ల విడుదల వాయిదా పడిందనీ, ఈ నెల తొమ్మిదిన రిలీజ్ చేస్తున్నామనీ నిర్మాతలు కమల్ బోరా, డి.లలిత, బి. ప్రదీప్, పంకజ్ బోరా చెప్పారు. విజయ్ మిల్టన్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను సిరి సాయిసినిమాస్ సంస్థ విడుదల చేస్తోంది.

బ్రిట్నీ స్పియర్స్ బయోపిక్



హాలీవుడ్ నటి, పాప్‌స్టార్ బ్రిట్నీ స్పియర్స్ జీవిత గాథ త్వరలోనే వెండితెరపైకి రానుంది. నిర్మాణసంస్థ యూనివర్సల్ పిక్చర్స్ బ్రిట్నీ స్పియర్స్ సోషల్ మీడియా ద్వారా శుక్రవారం ఈ విషయాన్ని ప్రకటించారు. 'నాకు ఇష్టమైన చిత్రాలను నిర్మించిన మార్క్ ప్లాట్‌తో ఒక సీక్రెట్ ప్రాజెక్ట్‌లో వర్క్ చేస్తున్నాను. ఈ విషయాన్ని మీతో పంచుకుంటున్నందుకు ఆనందంగా ఉంది' అని బ్రిట్నీ పేర్కొన్నారు. బ్రిట్నీ స్వీయ రచన 'ది ఉమెన్ ఇన్ మీ' ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కనుంది. జోన్ ఎం. ఛూ దర్శకత్వంలో మార్క్ ప్లాట్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో బ్రిట్నీ బాల్యం నుంచి స్టార్‌గా ఎదిగేవరకూ ఆమె ఎదుర్కొన్న సవాళ్లు, వాటిని అధిగమించిన తీరును ఆవిష్కరించనున్నారు.

ఇదేం షూటింగ్ కాదు

- హీరో విశాల్‌కు హైకోర్టు మందలింపు

హీరో విశాల్‌ను మద్రాస్ హైకోర్టు మందలించింది. అడిగిన దానికి సరిగ్గా సమాధానం ఇవ్వాలని, ఏదో ఒకటి చెప్పడానికి ఇదేమీ షూటింగ్ కాదంటూ కటువుగా వ్యాఖ్యానించింది. లైకా ప్రొడక్షన్స్ నుంచి హీరో విశాల్ తీసుకున్న రూ.21.29 కోట్ల రుణం కేసు విచారణ మద్రాస్ హైకోర్టులో కొంతకాలంగా సాగుతోంది. ఈ నేపథ్యంలో ఈ కేసు విచారణ గురువారం న్యాయమూర్తి పీటీ ఆషా సమక్షంలో జరిగింది. ఈ విచారణకు విశాల్ నేరుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లైకా ప్రొడక్షన్స్ తరఫు న్యాయవాది కొన్ని పత్రాలు చూపించి, అవి విశాల్ సంతకం చేసినవేనని పేర్కొన్నారు. ఇందుకు విశాల్ సమాధానమిస్తూ.. ఆ ఒప్పందం గురించి తనకేమీ తెలియదని, తన వద్ద కేవలం తెల్లకాగితంపై సంతకం తీసుకున్నారని చెప్పారు. దీంతో ఆగ్రహించిన న్యాయమూర్తి.. 'మీరు చేసిన సంతకాన్ని ఎలా కాదని చెబుతారు? చాలా తెలివిగా సమాధానం చెబుతున్నట్టు అనుకోవద్దు. ఇది షూటింగ్ కాదు. జాగ్రత్తగా సమాధానాలు చెప్పండి' అని మందలించారు.



చెన్నై, (ఆంధ్రజ్యోతి)

తైక్వాండో పోటీలకు జిల్లా క్రీడాకారులు

విజయనగరం దాసన్నపేట: అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఈ నెల 3, 4 తేదీల్లో జరగనున్న రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్ తైక్వాండో పోటీలకు జిల్లా నుంచి 38 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. కోచ్, మేనేజంగా గగన్‌సాగర్ డొర, చైతన్య, రిఫరీగా దీపిక వ్యవహరించనున్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గురానఅయ్యలు, వేణుగోపాలరావు అభినందించారు.

మలేరియా, డెంగ్యూ ప్రబలకుండా చూడండి: డీఎంహెచ్‌వో

విజయనగరం రూరల్: మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి భాస్కరరావు చెప్పారు. శుక్రవారం రాకోడు పీహెచ్‌సీ పరిధిలోని దుప్పాడ గ్రామంలో ఆయన పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడారు. పరిసరాలను పరిశీలించారు. నీరు నిల్వ ఉన్న కుండీలు, డ్రమ్ములను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేని పాటించాలని, నీరు ఎక్కువగా నిల్వ ఉన్న కుండీలు, డ్రమ్ములు, ట్యాంకులను శుభ్రపరచాలన్నారు. రాకోడు పీ హెచ్‌సీ వైద్యురాలు అఖిల, సిబ్బంది మాణిక్యం, రాముడ మ్మ, శ్రీను, కృష్ణ, స్వాతి, రత్నం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో బీఎస్‌ఎన్‌ఎల్ 4 జీ సేవలు

విజయనగరం టౌన్: ఉమ్మడి విజయనగరం జిల్లా ల పరిధిలో భారతీయ సంచార నిగమ్ లిమిటెడ్ (బీఎస్‌ఎన్‌ఎల్) 4 జీ టెక్నాలజీని దశలవారీగా ప్రవేశపెడుతున్నామని జిల్లా డిప్యూటీ జనరల్ మేనేజరు దాలినాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు 2జీ, 3 జీ సిమ్‌కార్డును తక్షణమే అప్‌గ్రేడ్ చేసుకోవాలని తెలిపారు. 4జీ అప్‌గ్రేడ్ చేసినా, 2జీ, 3 జీ సేవలు కొనసాగుతాయని తెలిపారు. 2జీ, 3జీ సిమ్ వినియోగిస్తున్న వినియోగదారులు కైవైసీ పూర్తి చేయాలని వచ్చిన సందేశాన్ని అంతరాయం లేకుండా 4 జీ సేవలను ఆస్వాదించడానికి తమ దగ్గరలో వున్న బీఎస్‌ఎన్‌ఎల్ కస్టమర్స్ సర్వీస్ సెంటర్, ఫ్రాంచైజీ, రిటైలర్లు, ఏజెంట్లను సంప్రదించాలని కోరారు.

వీఆర్వోలు బాధ్యతగా పనిచేయాలి

రాజాం: వీఆర్వోలు, వీఆర్యేలు బాధ్యతగా పని చేయాలని తహసీల్దార్ ఎస్.కృష్ణంరాజు ఆదేశించారు. శుక్రవారం తన కార్యాలయంలో వీఆర్వోలు, వీఆర్యేలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఆక్రమణలపై సమాచారం అందించాలని, అక్రమ గ్రావెల్ తవ్వకాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వాటర్ ప్లాంట్లను నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారని.. వాటిపై దాడులు చేసి మూసివేయిస్తున్నామని తెలిపారు. ఎవరైనా రాత్రి సమయల్లో వాటర్ బాటిల్స్ తరలిస్తే చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీటీ ప్రకాష్, ఆర్ఐ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లోకి కాంట్రాక్టు కార్మికులు

కొత్తవలస: అవసరాన్ని బట్టి కాంట్రాక్టు కార్మికులను జేఎస్ఎల్ కర్మాగార యాజమాన్యం పనిలోకి తీసుకుంటోంది. లాకౌట్ ఎత్తివేసి గురువారం నుంచి తెరచిన కర్మాగారంలో నిర్వహణా పనులను యాజమాన్యం చేయిస్తోంది. 47 మంది ఎంప్లాయిస్, కార్మికులతో పాటు సుమారు 50 మంది కాంట్రాక్టు కార్మికులను కూడా పనిలోకి తీసుకుంది. దశలవారీగా అవసరాన్ని బట్టి కాంట్రాక్టు కార్మికులను సైతం పనిలోకి తీసుకుని పని కల్పిస్తామని యాజమాన్యం తెలిపింది. సుమారు మూడు నెలలు పాటు నిర్వహణా పనులు జరిగే అవకాశం ఉందని, నిర్వహణా పనులు పూర్తయిన వెంటనే కాంట్రాక్టు కార్మికులందరికీ పని కల్పించనున్నట్టు తెలిపింది.

కౌలు కార్డుల పంపిణీపై సమీక్ష

బొబ్బిలి రూరల్: మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు ఆధ్వర్యంలో రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బందితో కౌలు రైతుల కార్డులపై శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు 963 కార్డులు మాత్రమే జారీ చేశారని, మిగిలిన కార్డులు 10 రోజుల్లో ఇవ్వాలని తహసీల్దారు ఆదేశించారు.

ఫిజియోథెరపీని వినియోగించుకోండి

బొబ్బిలి రూరల్: స్థానిక ప్రత్యేక అవసరాలు గల పిల్లల వనరుల కేంద్రంలో ఐఈఆర్‌ఈపీ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో శుక్రవారం 11 మందికి డాక్టర్ బి.శ్రీకాంత్ ఫిజియోథెరపీ సేవలు అందించారు. ప్రతి శుక్రవారం దివ్యాంగులు ఫిజియోథెరపీ సేవలు వినియోగించు కోవాలని సూచించారు. ఐఈఆర్‌పీ రవి, దివ్యాంగ పిల్లలు, తల్లిదండ్రులు భవిత కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

కాలువలో మొక్కల తొలగింపు

వంగర: మగ్గూరులో వర్షం నీటితో పాటు మడ్డువలస కాలువ నీరు పంటపొలాల్లోకి చేరి రైతులకు నష్టం జరుగుతుంది. దీంతో గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు శ్రీనువాసరావు చొరవ తీసుకుని పంటపొలాలనీరు బయటకు పోవటానికి ఏర్పాటు చేసిన కాలువల్లో పేరుకుపోయిన పిచ్చిమొక్కలను తొలగించటానికి సిద్ధమయ్యారు. గ్రామస్థులు, రైతులతో కలిసి శ్రమదానం చేయగా, కొంత మంది దినసరి కూలీలు వచ్చి కాలువల్లో మొక్కలు తొలగించారు.

జనసేన కార్యకర్తలకు బీమా

రేగిడి: జనసేన కార్యకర్తలకు రూ.5 లక్షల బీమా ఇవ్వడం ఒక వరమని ఆ పార్టీ మండల నేతలు బలసా శ్యాంసుందరరావు, గొర్లె గోవిందరావు, మీసాల రాంబాబులు పేర్కొన్నారు. ఉంగరాడమెట్ట వద్ద శుక్రవారం రెండో రోజు జనసేన నేతలు సభ్యత్వ క్యాంపెయిన్ నిర్వహించారు. కొంతమందికి సభ్యత్వాలు ఇచ్చారు. పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆశయాలు, ప్రజలకు చేస్తున్న సేవను వివరించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పుప్పల కాశీకృష్ణ, గొల్లపల్లి చక్రధర్, పల్లా రాము, సిరిపురపు శివ, పతివాడ శ్రీకుమార్ పాల్గొన్నారు.

పాఠశాల పరిశీలన

బొబ్బిలి రూరల్: పిరిడి గ్రామంలోని ఎం.పి.పి. పాఠశాలను ఎంఈఓ సీహెచ్ లక్ష్మణరావు శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా విద్యార్థుల హాజరు పట్టీని పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి.. నాణ్యత పాటించాలని సూచించారు.

ఉత్సాహంగా ఆరోగ్య బాలల పోటీలు

విజయనగరం రూరల్: ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో రోటరీ కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం ఆరోగ్య బాలల పోటీలు, ఫ్యాషన్ వాక్ ఫర్ ప్రెగ్నెంట్ ఉమెన్ తదితర పోటీలు నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా గైనకాలజిస్టులు డాక్టరు శాంతి, డాక్టరు నాగమల్లి, డాక్టరు విచిత్ర వ్యవహరించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. లేడీస్ రిక్రియేషన్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జి.శిరీష, కల్పనా కుక్రేజా, జిల్లా చైర్మన్ లక్ష్మీ శ్రీనివాస్, ప్రతినిధులు ఉమా బాలాజీ, బి.విశాలి, అనితా బోత్రా, వి.రాధిక, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవలు ఏర్పాటుచేయండి

శృంగవరపుకోట రూరల్: మండలంలోని గిరిశిఖర గ్రామాల్లో అత్యవసర వైద్యసేవలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి మద్దిల రమణ కోరారు. శుక్రవారం తహసీల్దార్ అరుణ కుమారికి వినతిపత్రం అందించారు.

రికార్డులకు పటిష్ఠ భద్రత కల్పించాలి

● కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశాలు

కలెక్టరేట్, ఆగస్టు 2: జిల్లాలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో రికార్డులకు పటిష్ఠ భద్రత కల్పించాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా రిజిస్ట్రార్, అగ్నిమాపక అధికారి, తదితరులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అగ్ని ప్రమాదాల జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు రాత్రి వేళ వాచ్‌మన్‌లను నియమించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రిజిస్ట్రార్ ఏవీ కుమారి, విద్యుత్ పంపిణీ సంస్థ ఎస్‌ఈ లక్ష్మణరావు, అసిస్టెంట్ ఫైర్ అధికారి సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఉద్యోగులపై సర్వే చేపట్టండి

జిల్లాలోని పరిశ్రమల్లో పని చేస్తున్న ఉద్యోగుల్లో స్థానికులు ఎంతమంది ఉన్నారో వారం రోజుల్లో సర్వే నిర్వహించి నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. శుక్రవారం తన చాం బర్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. జిల్లాలోని 196 కర్మాగారాల్లో ఉద్యోగుల సంఖ్యపై సర్వే చేయాలని ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్‌లను ఆదేశించారు. పరిశ్రమల్లో ఉద్యోగాలు 75 శాతం స్థానికులకే ఇవ్వాలన్న నిబంధన ఎంత వరకు అమలు జరుగుతుందో తెలుసుకోవాలన్నారు. ఈ నివేదికను సుప్రీం కోర్టుకు అందజేయాల్సి ఉన్నందున వారం రోజుల్లో సర్వే పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.అరుణ, ఇండస్ట్రీస్ జాయింట్ డైరెక్టర్ సీహెచ్ గణపతి, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి గోవిందరావు, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

చదువును కొనసాగించాలి

ఓపెన్ స్కూల్ ద్వారా విద్యాభ్యాసాన్ని కొనసాగించేలా చూడాలని కలెక్టర్ కోరారు. ఓపెన్ స్కూల్ ప్రవేశాలపై తన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఎటువంటి విద్యార్హతలు లేనివారు, చదువును మధ్యలో వదిలేసిన వారు నేరుగా పదోతరగతి పరీక్షలకు హాజరయ్యేందుకు ఆంధ్ర ప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం ఒక చక్కని మార్గమని అన్నారు. ఈ నెల 31 నాటికి 14 ఏళ్లు నిండినవారంతా పరీక్షలకు హాజరు కావచ్చని తెలిపారు. ఈనెల 27లోగా తమ పేర్లను ఆన్‌లైన్ లేదా ఎంఈవో కార్యాలయాల్లో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. పదోతరగతి పరీక్షకు హాజరయ్యేవారు ఫీజు రూ.100, ఇంటర్ పరీక్షకు రూ.200 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో డీఈవో ప్రేమకుమార్, జడ్పీ సీఈవో శ్రీధర్‌రాజా, డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ చక్రవర్తి, మెప్మా పీడీ సుధాకరరావు, డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి, ఆర్ఐవో ఆదినారాయణ, డీవీఈవో భీమా శంకర్, అసిస్టెంట్ కంట్రోలర్ తిరుమలరాజు సన్యాసిరాజు తదితరులు పాల్గొన్నారు.

బాలుడి మృతిపై భగ్గుమన్న స్థానికులు

● అధికారుల తీరుపై ఆగ్రహం.. రోడ్డుపై బైఠాయించి నిరసన

● ఎమ్మెల్యే బేబీనాయన హామీతో ఆందోళన విరమణ

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలోని అమ్మిగారి కోనేరుగట్టు వీధిలో జయప్రకాశ్ మున్సిపల్ స్కూలు దగ్గర గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 12 ఏళ్ల మణికంఠ దుర్మరణం పాలైన ఘటనపై స్థానికుల ఆగ్రహావేశాలు పెల్లుబికాయి. శుక్రవారం వేకువజాము నుంచి జయప్రకాశ్ స్కూలు రోడ్డుపై బైఠాయించి, పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ప్రమాదాలకు కారణమవుతూ నిండు ప్రాణాలను బలిగొంటున్న రోడ్లను తక్షణం బాగు చేయించాలని, భారీ వాహనాల రాకపోకలను నిషేధించాలని డిమాండ్ చేశారు. స్కూలు జోన్ బోర్డులు పెట్టి సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని, పార్వతీపురం నుంచి వచ్చే భారీ కంటైనర్లు, ఇతర భారీ వాహనాలను దారి మళ్లించాలని డిమాండ్ చేశారు.

ఈ శోకం ఏ తల్లిదండ్రులకూ వద్దు

'కళ్లెదుటే లారీ కిందపడి మణికంఠ దుర్మరణంతో మాకు కడుపు కోత మిగిలింది. ఇలాంటి గర్భశోకం ఏ తల్లిదండ్రులకూ రాకూడదు. చాలా ఏళ్ల నుంచి రోడ్లు బాగా లేవని.. మరమ్మతులు చేయండి అని గగ్గోలు పెట్టినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పుడొచ్చి ఏవేవో చెబుతున్నారు. మా పిల్లాడి ప్రాణాలను తిరిగి ఇవ్వగలరా?' అని మృతుని తల్లిదండ్రులు, తాతయ్య నిలదీస్తుంటే స్థానికులు భావోద్వేగానికి గురయ్యారు. ఆందోళన చేస్తున్న వారి దగ్గరకు మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి, సీఐ మలిరెడ్డి నాగేశ్వరరావు, కౌన్సిలర్ రాంబార్కి శరత్‌బాబు వచ్చి ఎంతగా నచ్చజెప్పినప్పటికీ వారి మాట వినకుండా ఆందోళన కొనసాగించారు. ఎమ్మెల్యే బేబీనాయన వచ్చి హామీ ఇస్తేనే ఆందోళన విరమిస్తామని పట్టుబట్టారు. కౌన్సిలర్ శరత్‌బాబు సూచనతో ఘటనా స్థలానికి వచ్చిన బేబీనాయన స్థానికుల డిమాండ్లను ఆలకించారు. ట్రాఫిక్ మళ్లింపు, ఇతర సమస్యలపై కలెక్టర్ అంబేడ్కర్, పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్రతో ఫోన్‌లో మాట్లాడారు. భారీ వాహనాలన్నిటినీ పాలకొండ-వీరఘట్టం రోడ్డులో మళ్లించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్, ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఇద్దరు ఎంఈవోలను రప్పించి స్కూలు జోన్ బోర్డులను ఏర్పాటు చేయాలని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని బేబీనాయన ఆదేశించారు. మృతి చెందిన మణికంఠ కుటుంబాన్ని ఆదుకునేందుకు అధికారులతో మాట్లాడతానని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో స్థానికులు ఆందోళనను విరమించారు.



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న స్థానికులు

ప్రతి కౌలు రైతుకూ రుణం అందాలి: జేసీ

కలెక్టరేట్: పొలంలోని పంట వేసిన ప్రతి కౌలు రైతుకు బ్యాంక్ నుంచి పంట రుణం అందాలని జేసీ కార్తీక్ తెలి పారు. రూ.70 కోట్ల రుణాలను కౌలు రైతులకు ఈ ఏడాది అందించాలన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంకర్లు, వ్యవసాయ శాఖ అధికారులతో జేసీ సమావేశం నిర్వహించారు. జిల్లాలోని 13 వేలు సీసీఆర్‌సీ కార్డులను కౌలు రైతులకు ఇవ్వడం జరిగిందని, మండల వారీగా ఆ జాబితాలను బ్యాంకు అధికారులకు పంపించామన్నారు. భూయజమాని రుణం తీసుకోవడం వల్ల కౌలుదారులకు రుణాలు ఇవ్వలేకపోతున్నామని కొంతమంది బ్యాంకర్లు జేసీ దృష్టికి తెచ్చారు. పంట వేసిన వారికే పంట రుణం పొందే అర్హత ఉంటుందని, కౌలు రైతులందరికీ రుణం వచ్చేలా చూడాలన్నారు. బ్యాంకు, వ్యవసాయ అధికారులు కలిసి గ్రామాల్లో రైతుల వద్దకే వెళ్లి, రుణ దరఖాస్తులను తీసుకోవాలని సూచించారు. సీసీఆర్ కార్డులు ఉన్న రైతులంతా అర్హులేనని వారిపై ఎలాంటి అనుమానాలకు తావు లేదని వారికి పంట రుణాలు అందజేయాలన్నారు. సమావేశంలో వ్యవసాయ శాఖ జేడీ తారక రామారావు, ఎల్‌డీఎం వీవీఆర్ మూర్తి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న జేసీ కార్తీక్

ఒడిసాలో బొల్లినేని మెడిస్కిల్స్

శ్రీకాకుళం రూరల్: ఒడిసా విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చేందుకు ఆ ప్రభు త్వంతో ఒప్పందం కుదుర్చుకున్నట్టు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గజపతి జిల్లా కలెక్టర్ స్మృతి రంజ న్ ప్రదాన్ సమక్షంలో అధికారులతో ఎంఓ యూ కుదిరిందన్నారు. గజపతి జిల్లా ఉపాధి కల్పనాధికారి సౌభాగ్య ఎస్ఆర్ త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.



ఒప్పందం చేసుకుంటున్న దృశ్యం

వాటర్‌ప్లాంట్లు తెరిస్తే క్రిమినల్ కేసులు

● తహసీల్దార్ కృష్ణంరాజు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రాజాం రూరల్: సీజ్ చేసిన వాటర్ ప్లాంట్లను అనధికారికంగా తెరిచినా, పట్టణంలో కేన్లు ద్వారా నీటిని సరఫరా చేసినా జరిమానాతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని రాజాం తహసీల్దార్ కృష్ణంరాజు హెచ్చరించారు. 'తహసీల్దార్ సీజ్ చేసినా..' శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి తహసీల్దార్ తీవ్రంగా స్పందించారు. పట్టణంలోని కొన్ని వాటర్ ప్లాంట్లను ఆయన స్వయంగా పరిశీలించి యజమానులను హెచ్చరించారు. నిర్దేశిత నిబంధనల ప్రకారం జిల్లా కలెక్టర్ అనుమతితో మాత్రమే ప్లాంట్లు నిర్వహించాలని స్పష్టం చేశారు. గతనెల 23న తాను సీజ్ చేస్తే తిరిగి ఎవరి అనుమతితో తెరిచారని ప్లాంట్ల యజమానులను ప్రశ్నించారు. నిబంధనలకు విరుద్ధంగా నాణ్యతలేని నీటిని ప్రజలు తాగి రోగాలబారిన పడితే ఎవరు బాధ్యులని పేర్కొన్నారు. వీఆర్వోలు అప్రమత్తంగా ఉండాలని, వాటర్‌ప్లాంట్లు తెరిసే కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.

మనోధైర్యంతో ముందుకు సాగాలి

కొత్తవలస: దివ్యాంగులు మనోధైర్యంతో ముందుకు సాగాలని విజయనగరం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి సీనియర్ సివిల్ న్యాయాధికారి కె.విజయకల్యాణి అన్నారు. శుక్రవారం మంగళపాలెం గ్రామంలోనున్న గురుదేవ చారిటబుల్ ట్రస్టును ఆమె సందర్శించారు. విర్కో ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంతోమంది దివ్యాంగులు చక్కని ప్రతిభ కనబరుస్తున్నారని, వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. గురుదేవ చారిటబుల్ ట్రస్టు ద్వారా గత 24 సంవత్సరాల నుంచి సేవలు అందించడం విశేషమన్నారు. దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్స్, ఇతరత్రా న్యాయపరమైన సేవల్లో ఇబ్బందులు ఉంటే జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీకి దరఖాస్తు చేసుకుంటే తక్షణ సాయం అందించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అవయవ తయారీ కేంద్రాన్ని, గురుదేవ ఆసుపత్రిని సందర్శించారు. 175 మంది దివ్యాంగులకు కృత్రిమ ఉపకరణాలు, వీల్‌చైర్లు, ట్రై సైకిళ్లు, చెవిటి మిషన్లు అందజేశారు. కార్యక్రమంలో విర్కో ఫౌండేషన్ చైర్మన్ టి.ప్రవీణ, ట్రస్టు చైర్మన్ రావర్తి జగదీష్‌బాబు, వైస్‌చైర్మన్ ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.



కృత్రిమ అవయవాలను పరిశీలిస్తున్న విజయకల్యాణి

హిట్ అండ్ రన్ బాధితులకు పరిహారం

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: హిట్ అండ్ రన్ (గుర్తు తెలియని వాహనాలు ఢీకొన్న) కేసుల్లో బాధితులు పరిహారం కోసం దరఖాస్తు చేసుకోవాలని డీఆర్వో జి.కేశవనాయుడు తెలిపారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో రెవెన్యూ, పోలీసు అధికారులు, బాధితులతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ హిట్ అండ్ రన్ కేసుల్లో మరణించిన వారి కుటుంబాలకు రూ.రెండు లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.50 వేలు పరిహారం అందించనున్నట్టు తెలిపారు. బాధితులు వెంటనే క్లెయిమ్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓలు కె.హేమలత, వి.వి.రమణ, చినమేరంగి సీఐ బి.మంగరాజు, పార్వతీపురం టౌన్ ఎస్ఐ కె.ప్రయోగమూర్తి, పార్వతీపురం టౌన్ ఎస్ఐ బి.సంతోషి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి

నిబద్ధతతోనే లక్ష్యాల సాధన

● ఏయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గిరిజా శంకర్

విజయనగరం టౌన్: విద్యార్థులు నిజాయితీ, నిబద్ధతతో శ్రమించి.. అనుకున్న లక్ష్యాలను సాధించాలని ఆంధ్రా యూనివర్సిటీ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ప్రిన్సిపాల్ గిరిజా శంకర్ అన్నారు. విజయనగరం మహారాజా ఫార్మసీ కళాశాల 20వ వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ చెడు మార్గాల వైపు మళ్లితే లక్ష్యాలను చేరుకోలేరని తెలిపారు. అనంతరం ఈ ఏడాది మెరిట్ సాధించిన విద్యార్థులకు షీల్డ్‌లు, ప్రశంసాపత్రాలను అందజేశారు. అంతకుముందు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కేవీ ప్రభావతి, ఫైజర్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ గ్రూప్ మేనేజర్ కె.అనిల్, కరస్పాండెంట్ కేవీఎల్ రాజు, ప్రిన్సిపాల్ పి.ఉదయ్‌శంకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గిరిజా శంకర్

కుమరాం పంచాయతీ రికార్డులు సీజ్

● నిధుల దుర్వినియోగంపై విచారణ

జామి: కుమరాం పంచాయతీలో పెద్దఎత్తున నిధులు దుర్వినియోగమయ్యాయని, ఈ విషయంపై గ్రామస్థులు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారని 'ఆంధ్రజ్యోతి' కొద్దిరోజుల క్రితం ప్రచురించింది. శుక్రవారం దీనిపై జిల్లా పంచాయతీ అధికారి మోహనరావు గ్రామ సచివాలయంలో ఫిర్యాదుదారులు, గ్రామకార్యదర్శి కృష్ణ తదితరులతో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులు మట్లాడుతూ పంచాయతీ నిధుల నుంచి వీధి లైట్ల కొనుగోలు, బ్లీచింగ్, ఫినాయిల్ కొనుగోళ్లు, శానిటేషన్ పనుల నిర్వహణలో నిధులు దుర్వినియోగమయ్యాయని తెలిపారు. పారిశుధ్యం మెరుగు పేరుతో నిధులు పెద్దఎత్తున దుర్వినియోగమయ్యాయన్నారు. ఈ విషయాలపై తాము అనేకసార్లు సమాచార హక్కు ద్వారా వివరాలు కోరినా ఇవ్వలేదని తెలిపారు. డీఎల్‌పీవో మాట్లాడుతూ ఈ విషయాలపై పూర్తి స్థాయి దర్యాప్తు చేస్తామని, అక్రమాలు నిజమైతే సంబంధిత అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవని చెప్పారు. అనంతరం ఈఓపీఆర్‌డీ శ్రీదేవి పంచాయతీ రికార్డులు స్వాధీనం చేసుకొని జిల్లా కార్యాలయానికి తరలించారు.



విచారణ నిర్వహిస్తున్న డీఎల్‌పీవో మోహనరావు

పింగళి వెంకయ్యకు ఘన నివాళి

మువ్వన్నెల జెండా రూపకర్త, స్వాతంత్ర్య సమరయోధుడు పింగళి వెంకయ్య జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలలు, కార్యాలయాల్లో ఈ వేడుకలు నిర్వహించారు. రామభద్రపురం, పాలకొండ, బొబ్బిలి, రాజాంతో పాటు పలు చోట్ల ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు.



రామభద్రపురంలో..



పాలకొండలో..



రాజాంలో..

బావిలో పడి వ్యక్తి మృతి

రేగిడి: బావిలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రేగిడి సివిల్‌సప్లయ్ గొడౌన్‌లో ఆమదాలవలస గ్రామానికి చెందిన కుమిలి రాంబాబు(35) కళాసీగా పనిచేస్తున్నాడు. ఈయనకు నాలుగేళ్ల క్రితం చిన్నశిర్లాం గ్రామానికి చెందిన సంతుతో వివాహమైంది. వీరికి రెండేళ్ల పాప పూజిత ఉంది. ఇటీవల అత్తవారి ఊర్లో వారాలు కాగా భార్యను పంపించి తాను వెళ్లలేకపోయాడు. దీంతో భార్యను చూసేందుకు శుక్రవారం ఉదయం చిన్నశిర్లాంలోని అత్త వారింటికి వెళ్లాడు. అక్కడి నుంచి శుక్రవారం మధ్యాహ్నం స్థానికంగా ఉన్న బావిలో పడిపోయి ఉన్నట్టు గ్రామస్థులు గుర్తించారు. వెంటనే సమాచారం అందుకున్న పోలీసులు వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని బయటకు తీశారు. అయితే ఈ ఘటనపై ప్రమాదమా లేదా ఆత్మహత్యా అని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కానీ ఎస్ఐ శ్రీనివాస్ మాత్రం ఈయన మద్యం మత్తులో ఉన్నట్లు, స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు పడిపోయి ఉండవచ్చని ప్రాథమిక సమాచారంగా చెప్పారు. కుటుంబీకుల ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టు మార్టమ్ నిమిత్తం రాజాం పంపించినట్లు తెలిపారు.

రామభద్రపురంలో భారీ చోరీ

● 25 తులాల బంగారం, అరకేజీ వెండి అపహరణ

రామభద్రపురం, ఆగస్టు 2: మండల కేంద్రంలోని శ్రీరాంనగర్ కాలనీలో శుక్రవారం తెల్లవారుజామున భారీ చోరీ జరిగింది. స్థానికంగా వ్యాపారం చేస్తున్న పప్పు ఈశ్వరరావు తన కుటుంబ సభ్యులతో కలిసి గురువారం తీర్థయాత్రలకు బయలుదేరాడు. ఇదే అదునుగా చూసిన దొంగలు ఈ చోరీకి ప్లాన్ వేశారు. ఇంటిలోని బీరువాలో ఉన్న సుమారు 25 తులాల బంగారం, అరకేజీ వెండి అపహరించినట్టు కుటుంబ సభ్యులు గుర్తించారు. దీనిపై సమీప బంధువు పప్పు రాంబాబు ఫిర్యాదు చేయడంతో ఘటనా స్థలాన్ని విజయనగరం క్లూస్ టీం పరిశీలించారు. క్లూస్‌టీం ఎస్ఐ మురళీమోహన్ ఆధ్వర్యంలో వేలిముద్రల నమూనాలు సేకరించారు. బాడంగి ఎస్ఐ జయంతి కూడా ఘటనా స్థలాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. దీనిపై ఏఎస్ఐ అప్పరావు కేసు నమోదు చేశారు. పోలీసు స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఈ దొంగతనం జరగడం విశేషం.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న క్లూస్‌టీం ఎస్ఐ మురళీమోహన్

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

లక్కవరపుకోట: మండలంలోని విశాఖ-అరుకు రోడ్డు మార్గంలో శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతిచెందాడు. దీనికి సంబంధించి ఎస్ఐ గోపాలరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖ జిల్లా దేవరాపల్లి మండలం ముషిడిపల్లికి చెందిన గుంటు లక్ష్మణరావు(69) రంగారాయపురంలోని బంధువుల ఇంటికి గురువారం వచ్చాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం రంగారాయపురం నుంచి ఎల్.కోట వైపు నడుచుకుంటూ వస్తుండగా ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొంది. ఈ ఘటనలో లక్ష్మణరావు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు అతనిని స్థానిక పీహెచ్‌సీకి తరలించి అక్కడి నుంచి విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం మరణించినట్లు పోలీసులు తెలిపారు. జరిగిన ఘటనకు కారకుడైన ఎం.అప్పలరాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వృద్ధురాలిపై దాడి

సంతకవిటి: మండలం కొత్తూరు రామచంద్రపురం గ్రామానికి చెందిన కాలయ ఎల్లమ్మ అనే వృద్ధురాలిపై అదే గ్రామానికి చెందిన తేగల రాము అనే వ్యక్తి శుక్రవారం మద్యం మత్తులో దాడి చేశాడు. దీంతో వృద్ధురాలి గాయపడి అపస్మారక స్థితిలోకి చేరుకుంది. దీంతో స్థానికులు ఆమెను రిమ్స్‌కు తరలించడంతో అక్కడ చికిత్స పొందుతోంది. దీనిపై బాధితురాలి సోదరుడు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ వాసుదేశరావు తెలిపారు.

సచివాలయంలో చోరీ

రేగిడి: మండలం తోకలవలస సచివాలయంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి వలంటీర్లకు సంబంధించిన రెండు సెల్‌ఫోన్లు చోరీ చేశారు. దీనిపై సెక్రటరీ రాకేష్ ఇచ్చిన ఫిర్యాదుతో ఎస్ఐ శ్రీనివాస్ సిబ్బందితో పాటు వెళ్లి శుక్రవారం పరిశీలించారు. కార్యాలయంలో ఉన్న బిరువా తాళాలు పగలుగొట్టగా, డబ్బులేవీ లేకపోవడంతో సెల్‌ఫోన్లు మాత్రమే అపహరించారని ఎస్ఐ తెలిపారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మరో రెండు డయేరియా కేసులు

శృంగవరపుకోట రూరల్: మండలంలోని గిరిశిఖర గ్రామాలైన పొర్లు, కురిడి నుంచి రెండు డయేరియా కేసులు నమోదయ్యాయి. వీరు కూడా సదరు స్వచ్ఛంద సంస్థలో భోజనాలు చేసి అక్కడే పాఠశాలలకు వెళ్తున్నారని, చిట్టెంపాడు విద్యార్థులతోపాటు తమ పిల్లలను తీసుకొచ్చినట్లు పిల్లల తండ్రులు తెలిపారు. సీహెచ్‌సీలో చేర్చిన వారిలో సంతోష్(7), లావణ్య (11) ఉన్నారు.

ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు సస్పెన్షన్

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: పింఛన్లలో అక్రమాలకు పాల్పడిన ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పింఛన్లలో అక్రమాలకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు రావడంతో విచారణ చేపట్టారు. ప్రాథమిక విచారణలో వాస్తవమని వెల్లడి కావడంతో పాచిపెంట మండలం కేసలి పంచాయతీ గ్రేడ్-4 కార్యదర్శి సేనాపతి సునీత, గ్రేడ్-5 గ్రామ కార్యదర్శి కోలక వాసులను సస్పెండ్ చేశారు. రెండు సంవత్సరాల కిందట మరణించిన వ్యక్తి పేరుతో పింఛన్ పంపిణీ చేస్తున్నట్టు ధ్రువీకరణ కావడంతో సస్పెండ్ చేశారు.

రెండు క్వారీలు సీజ్

భోగాపురం: కొంగవానిపాలెం రెవెన్యూ రామచంద్రపేట పంచాయతీ పరిధిలో ఉన్న రెండు క్వారీలను ఆర్డీవో సూర్యకళ, మైన్స్ అధికారి ఎస్.చల్లాలు శుక్రవారం రాత్రి సీజ్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. రామచంద్రపేట పంచా యతీలో సుమారు ఏడు ఎకరాల్లోగల డీపట్టా భూముల్లో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా విశ్వంభర కనస్ట్రక్షన్స్, కోటిపాటిపర్స అను రెండు క్వారీల్లో స్టోన్ కనస్ట్రక్షన్ పాయింట్, కార్యాలయ భవనం అక్రమంగా నిర్వహిస్తున్నారని అధికారులు గుర్తించి, దీనికి సంబంధించి గ్రామస్థుల సమక్షంలో రిపోర్ట్ తయారు చేశారు. అనంతరం రెండు క్వారీల నిర్వహణకు సంబంధించిన గదులను సీజ్ చేశారు. దీనిపై తహసీల్దార్ ఎం.సురేష్‌ను వివరణ కోరగా అక్రమంగా క్వారీలు నిర్వహించ డంతో వాటిని సీజ్ చేశామని చెప్పారు. క్వారీలను సీజ్ చేయడంతో లారీలు నిలిచిపోయాయి. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ హరీష్, ఆర్ఐ కిశోర్, వీఆర్వో ఉష, గ్రామ నాయకులు కోలా రామసూరి, దుక్క రమణ, దుక్క అప్పన్న, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.



నిలిచిన లారీలు

పాము కాటుతో యువకుడి మృతి

బొబ్బిలి రూరల్: మండలంలోని చింతాడ గ్రామంలో శుక్రవారం రైతు టి.పోలినాయుడు కుమారుడు, టి.సుధీర్ (27) పాము కాటుకి గురై మృతి చెందాడు. సుధీర్ ఉదయం పొలంలో బహిర్భూమికి వెళ్లి తిరిగి వస్తుండగా దారిలో పాము కరిచినట్ట యిందని తండ్రికి తెలిపాడు. అంతలోనె స్పృహ కోల్పోయాడు. వెంటనే సుధీర్‌ను బొబ్బిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ప్రాణాలు కోల్పో యాడని వైద్యులు తెలిపారు. విషయం తెలిసిన పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్‌మార్టానికి పంపించారు.

అక్రమ కలప స్వాధీనం

కురుపాం: గుమ్మలక్ష్మీపురం మండలం నుంచి పాలకొండకు అక్రమంగా తరలిస్తున్న టేకు దుంగలను అటవీశాఖ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. ఈసందర్భంగా కురుపాం ఫారెస్టు రేంజ్ అధికారి మణికంఠేశ్వరావు స్థానిక విలేకర్లతో మాట్లాడారు. గుమ్మలక్ష్మీపురం మండ లం కొండవాడ గ్రామం నుంచి ఓ రైతు మూడు టేకు చెట్ల దుంగలను పాల కొండకు తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసి, కురుపాం ఫారెస్టు కార్యాల యానికి తరలించినట్టు తెలిపారు. వీటి విలువ సుమారు లక్ష రూపాయాలు ఉం టుందన్నారు. ఈ కార్యక్రమంలో కురుపాం ఫారెస్టు సెక్షన్ అధికారి సూర్యప్రకాష్, అటవీ శాఖ బీట్ అధికారులు, అసిస్టెంట్ బీట్ అధికారులు పాల్గొన్నారు.



ఫారెస్టు అధికారులు పట్టుకున్న కలప

ఎస్సీ వర్గీకరణపై పునరాలోచించాలి


అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

పాలకొండ: ఎస్సీ వర్గీకరణ అంశంలో సుప్రీం కోర్టు తీర్పుపై పునరాలోచించాలని రాష్ట్ర మాల మహానాడు సంఘ సభ్యులు, ఎస్సీ ఉద్యోగ సంఘాల నాయకులు ఎద్దు లిల్లీ పుష్పనాథం, ఎన్.భరత్‌భూషణ్, బత్తిన మోహన్ డిమాండ్ చేశారు. ఏలాం కూడలిలో నిరసన తెలిపి మానవహారం నిర్వహించారు. అనంతరం ప్రెస్‌క్లబ్ ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పుతోట దళిత ఉద్యోగ కుటుంబాలకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. ఈ అంశంపై న్యాయపోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు, దళిత యువసేన సభ్యులు రాకోటి వెంకటరావు, మడపల ప్రసాదరావు, తిర్లంగి ఉపేంద్ర, బొంతు గవరయ్య, రాజుకుమార్, పొట్నూరు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు మేలు


కేక్ కట్ చేస్తున్న దళితులు

భామిని: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ భామిని దళిత వాడలో పలువురు శుక్రవారం కేక్‌ను కట్ చేశారు. స్థానిక దళిత నాయకులు లోపింటి రాజేష్ మాట్లాడుతూ 1996 నుంచి వర్గీకరణకు కృషి చేయగా వర్గీకరణ అయ్యాక మళ్లీ ప్రభుత్వాలు మారడంతో నిలుపుదల చేశారు. అయితే వర్గీకరణతో నిరుపేద విద్యావంతులకు మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజు, బి.ప్రసాద్, బి.సంజీవి, జి.రవి, సీహెచ్.చరణ్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకుల రెగ్యులరైజేషన్ ప్రక్రియ ప్రారంభించాలి

పార్వతీపురం టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా ఐదు వేలమంది కాంట్రాక్టు అధ్యాపకుల రెగ్యులరైజేషన్ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను మంగళగిరి సచివాలయంలో కలిసి మెమోరాండం అందించినట్టు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు శుక్రవారం విలేకర్లకు ఫోన్‌లో తెలిపారు. గత ప్రభుత్వం రెగ్యులైజేషన్ చట్టం చేసి జీవో నెంబరు 114ను విడుదల చేసిందని, రాష్ట్ర వ్యాప్తంగా వివిధ శాఖల్లో 10,117 మందిని రెగ్యులైజేషన్ చేసేందుకు అనుమతించిందని తెలిపారు. కానీ ఇప్పటికి 3వేల మందిని మాత్రమే రెగ్యులైజేషన్ చేశారని, ముఖ్యంగా మెడికల్ అండ్ హెల్త్‌లో మాత్రమే చేశారని చెప్పారు. మిగిలిన శాఖల్లో ముఖ్యంగా విద్యాశాఖలో సుమారు ఐదు వేల మందిని రెగ్యులైజేషన్ చేయవలసి ఉందని మంత్రికి తెలిపినట్లు చెప్పారు.

ఆరేళ్ల అద్దె ఒకేసారి చెల్లించమంటే ఎలా?

సాలూరు: మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌కు సంబంధించి ఆరేళ్ల అద్దె డబ్బులు, జీఎస్టీ ఒకేసారి చెల్లించమంటే ఎలా కట్టగలమని షాపుల యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ పి.ప్రసన్నవాణిని సాలూరులోని తన కార్యాలయంలో కలిసి, తమ గోడును వినిపించారు. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో సుమారు 18 షాపులు నిర్వహిస్తున్నామని తెలిపారు. 2021 వరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాము మున్సిపాల్టీకి అద్దెలు చెల్లించటంతో పాటు క్రమం తప్పకుండా రెన్యూవల్ కూడా చేయించుకొనేవారమని చెప్పారు. అయితే గత మూడేళ్ల నుంచి మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అస్సలు పట్టించుకోని అధికారులు ఒక్కసారిగా తమకు నోటీసులు పంపి, ఆరేళ్ల అద్దె డబ్బులు, జీఎస్టీ డబ్బులు చెల్లించమంటే ఎలా కట్టగలమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ నుంచి జీఎస్టీలు ఎందుకు వసూలు చేస్తున్నారో అర్థం కావటం లేదన్నారు.

ఆరోగ్య రక్షణపై అవగాహన అవసరం

పార్వతీపురం రూరల్: ఆరోగ్య రక్షణ పట్ల అవగాహన కలిగి ఉండాలని రెండో అదనపు జిల్లా న్యాయాధికారి ఎస్.దామోదరరావు అన్నారు. రావికోన గ్రామంలో మండల లీగల్ సర్వీస్ కమిటీ, రెడ్ క్రాస్, లయన్స్ క్లబ్, ఐఆర్‌పీడబ్ల్యుఏ, డాక్టర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో విజయనగరం మిమ్స్ ఆసుపత్రి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సౌజన్యంతో శుక్రవారం ఉచిత వైద్యం శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రెండో అదనపు జిల్లా న్యాయాధికారి ఎస్.దామోదరరావు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు, మలేరియా, చిన్న పిల్లల వ్యాధులు, మహిళల గర్భకోశ వ్యాధులపై అవగాహన అవసరమన్నారు. జీపీ స్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. రావికోన, చందలింగి, కొత్తవలస, అద్దూరువలస, ఆర్యేబట్టివలస గ్రామాలకు చెందిన దాదాపు 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. రెడ్‌క్రాస్ ఛైర్మన్ ఎం.శ్రీరాములు, పార్వతీపురం జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.వాగ్దేవి, డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో టి.జగన్మోహన్‌రావు పాల్గొన్నారు.

భారీ వాహనాలతో భయాందోళన


తోటపల్లి జట్టు కార్యాలయం సమీపంలో దిగబడిన భారీ వాహనం

గరుగుబిల్లి: ప్రధాన రహదారిపై భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో వాహనదారులు, ప్రజలు భయాందోళన చెందుతున్నారు. బొబ్బిలి సమీపంలోని పారాది వంతెన బలహీనంగా ఉండటంతో అధికంగా వాహనాలు ఒడిశాతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి మండలం మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. భారీ వాహనాల కారణంగా రహదారులు గోతులమయమై ప్రమాదాలు సంభవిస్తున్నాయి. శుక్రవారం ఛత్తీస్‌ఘడ్ నుంచి విశాఖకు 18 టైర్ల లారీ పాత వంతెన గుండా వెళ్లేందుకు తోటపల్లికి చేరుకుంది. భారీ వాహనం కావడంతో మలుపు సమీపంలో వెళ్లేందుకు వీలుపడలేదు. పాత వంతెన ప్రమాదభరితంగా ఉండడంతో వాహనాన్ని తిరిగి వెనక్కి మళ్లించే ప్రయత్నం చేశారు. తోటపల్లి నూతన జట్టు ట్రస్ట్ కార్యాలయ ప్రాంతంలో అది మట్టిలో దిగబడిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. పోలీసులు జేసీబీతో భారీ వాహనాన్ని బయటకు తీశారు. గంటకు పైగా ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పోలీసు, రవాణా సిబ్బంది భారీ వాహనాలను ఉల్లిభద్ర ప్రధాన మార్గం నుంచి రాత్రి సమయాల్లో వెళ్లేలా చర్యలు చేపట్టాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

నాలుగో తరగతి ఉద్యోగుల నియామకాలు చేపట్టాలి

సీతంపేట: ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గిరిజన సంక్షేమశాఖలో నాలుగో తరగతి ఉద్యోగుల నియామకాలు చేపట్టాలని రాష్ట్ర శాఖా ప్రధాన కార్యదర్శి జి.శేషగిరిరావు కోరారు. శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో పీవో రాహుల్ కుమార్‌రెడ్డిని కలిసి సమస్యలు వివరించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నారాయణరావు, రవికుమార్, సూరిబాబు, ధర్మారావు, జయరాం, సూర్యం పాల్గొన్నారు.

'నిందితుడి పేరు శివకుమార్ కాదు'

పార్వతీపురంటౌన్: జిల్లా కేంద్రంలో ఓ మహిళ ఆత్మహత్యా యత్నానికి సంబంధించి నిందితుడి పేరు పవన్‌కుమార్‌కు బదులుగా శివకుమార్ అని శుక్రవారం పత్రికల్లో పొరపాటున ప్రచురితమైందని పట్టణ పోలీసుస్టేషన్ ఎస్‌ఐ రవీంద్రరాజు తెలిపారు. ఈ ఆత్మహత్యాయత్నానికి శివకుమార్‌కు సంబంధం లేదని స్పష్టంచేశారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

గరుగుబిల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో పి.సూర్యనారాయణ, ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావులు హెచ్చరించారు. శుక్రవారం రావపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలను వీరు పరిశీలించారు. ఈ నెల 8న నిర్వహించనున్న ఎస్‌ఎంసీ ఎన్నికలు సంబంధించి అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు.

పోతులగెడ్డ బ్రిడ్జి పరిశీలన

పాలకొండ: పట్టణంలోని పోతులగెడ్డ బ్రిడ్జిని స్థానికులు టీడీపీ పట్టణ అధ్యక్షుడు సంతోష్ యువ నాయకులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. నగర పంచాయతీ పాలకవర్గం ఎన్నికల ముందు ప్రారంభించి తర్వాత గాలికొదిలేశారు. దీనిపై ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఈ రోడ్డుతో పార్వతీపురం ప్రధాన రహదారికి అడ్డదారి కలిసి వస్తుందని స్థానికులు తెలిపారు.

తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం

● వారోత్సవాల్లో భాగంగా గ్రామాల్లో అవగాహన ర్యాలీలు

తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యమని ఐసీడీఎస్ అధికారులు, వైద్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు సూచించారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం జిల్లాలోని పలు గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. తల్లిపాల ఆవశ్యకతపై వివరించారు. పుట్టిక బిడ్డకు తల్లిపాలు పట్టడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. అలాగే పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ అవగాహన కార్యక్రమాల్లో అంగన్‌వాడీ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.
(ఆంధ్రజ్యోతి బృందం)


సాలూరు రూరల్: మామిడిపల్లిలో..


భామిని: తల్లిపాలు వారోత్సవాలపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


కొమరాడ: రాజ్యలక్ష్మీపురంలో..


పాలకొండ: బుక్కూరులో..


వీరఘట్టం: అవగాహన కల్పిస్తున్న దృశ్యం


గరుగుబిల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


జియ్యమ్మవలసలో..

జిల్లాలు దాటి పింఛన్లు అందజేత

సాలూరు రూరల్: వివిధ కారణాలతో ఇతర ప్రాంతాల్లో ఉన్న పింఛన్‌దారులకు సైతం సచివాలయ సిబ్బంది శుక్రవారం పింఛన్లు అందజేశారు. శివరాంపురానికి చెందిన నల్లి వెంకటి అనారోగ్యంతో శ్రీకాకుళం ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. శివరాంపురం డిజిటల్ అసిస్టెంట్ నూకరాజు శ్రీకాకుళం వెళ్లి ఆయనకు పింఛను మొత్తం అందించారు. అదే గ్రామానికి చెందిన కరిబుగత ఆదమ్మ నడవ లేని స్థితిలో విశాఖపట్నంలో చికిత్స పొందుతున్నారు. ఆయన శ్రీకాకుళం నుంచి విశాఖ వెళ్లి ఆమెకు పింఛను మొత్తం అందించారు. జీగిరాంకు చెందిన లోమిని వెంకటరరావు విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఎముకలకు సంబంధించి శస్త్ర చికిత్స చేయించుకున్నారు. జీగిరాం డిజిటల్ అసిస్టెంట్ సాయిలక్ష్మి ఆ ఆసుపత్రికి వెళ్లి ఆయనకు పింఛన్ అందించారు. జీగిరాం కాలనీకి చెందిన పూడి సత్యారావు విశాఖలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఐసీయూలో ఉన్నారు. అక్కడకు నెల్లిపర్తి పంచాయతీ కార్యదర్శి ప్రేమ్‌సుధాకర్ వెళ్లి పింఛను మొత్తం అందించారు.

శతశాతం పంపిణీ

మండలంలో మరణాలు, వలస పోయిన 46 మందికి మినహా శతశాతం పింఛన్లు శుక్రవారం నాటికి పంపిణీ చేసినట్టు ఎంపీడీవో ఫణేంద్రకుమార్ చెప్పారు. మండలంలో 22 గ్రామ సచివాలయాల పరిధిలో 8,433 సామాజిక పింఛనుదారులు ఉన్నారని తెలిపారు. వారిలో 37 మంది గత నెల రోజుల్లో మరణించారని, వారు పేర్లు జాబితా నుంచి తొలగలేదని చెప్పారు. మరో 9 మంది దూరప్రాంతాలకు వలస వెళ్లారన్నారు. ఈ 46 మందికి మినహా 8,387 మందికి పింఛన్ అందించామని తెలిపారు.

కొదమ కార్యదర్శికి ఎంపీ అభినందన

ఎత్తైన కొండల్లో ఉన్న చింతామల, లొద్ద, బందపాయి గ్రామాలకు వర్షంలో నడిచి వెళ్లి పింఛన్లు పంపిణీ చేసిన కొదమ పంచాయతీ కార్యదర్శి ఎర్రాన్నాయుడును విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు శుక్రవారం ఫోన్ చేసి అభినందించారు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనం చూసిన ఆయన కార్యదర్శికి ఫోన్ చేసి అభినందనలు తెలిపారు.

ఎంపీడీవోకు మంత్రి అభినందన

సాలూరు మండలంలోని గిరిశిఖరాలకు సైతం సకాలంలో పింఛన్లు పంపిణీ చేయించడంతో చొరవ చూపిన ఎంపీడీవో ఫణేంద్రకుమార్‌ను మంత్రి గుమ్మిడి సంధ్యారాణి శుక్రవారం ఫోన్ చేసి అభినందించారు. ఆంధ్రజ్యోతిలో కథనం చూసిన ఆమె ఆయనకు ఫోన్ చేసి అభినందించారు.


సాలూరు రూరల్: శ్రీకాకుళం, విజయనగరం ఆసుపత్రుల్లో పింఛన్లు ఇస్తున్న శివరాంపురం, జీగిరాం డిజిటల్ అసిస్టెంట్లు నూకరాజు, సాయిలక్ష్మి


మక్కువ: పింఛన్ అందిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ సతీష్‌కుమార్

విజయవంతంగా..

వీరఘట్టం: వీరఘట్టం జామివారి తోటలో శుక్రవారం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు జామి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రెండో నెల కూడా విజయవంతంగా పింఛన్ల పంపిణీ పూర్తి చేశారని, దీంతో పింఛనుదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. బల్లా హరిబాబు, జామి సింహాచలం, తూముల రమేష్, క ర్రి అప్పన్న, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మక్కువ: మండల కేంద్రం మక్కువకు చెందిన ఎ.గంగమ్మ అనారోగ్యంతో బాధపడుతూ పార్వతీపురం పట్టణంలోని సాయినగర్‌లో కుమార్తె నివాసం వద్ద ఉండడంతో స్థానిక సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ రౌతు సతీష్‌కుమార్ శుక్రవారం పార్వతీపురం వెళ్లి పింఛన్లు అందించారు. ఇంటికి వచ్చి పెన్షన్ అందించేందుకు కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

ఎంఈవోపై విచారణ


ఎంఈవో నాగభూషణరావు అవినీతి ఆరోపణలపై విచారణ చేపడుతున్న అధికారులు

గరుగుబిల్లి: మండల విద్యాశాఖాధికారిగా విధులు నిర్వహిస్తున్న ఎన్.నాగభూషణరావుపై వచ్చిన అవినీతి ఆరోపణలపై స్థానిక ఎమ్మార్సీ భవనంలో శుక్రవారం అధికారులు విచారణ చేపట్టారు. గరుగుబిల్లి, జియ్యమ్మవలస మండలాల పరిధిలో ఎంఈవో-1గా విధులు నిర్వహిస్తున్న నాగభూషణరావుపై అవినీతి ఆరోపణలు చేస్తూ యూటీఎఫ్ ప్రతినిధులు ఆర్‌జేడీ, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని డిప్యూటీ డీఈవో పి.కృష్ణమూర్తి, పార్వతీపురం ఎంఈవో-2 కర్రి ప్రసాదరావు తెలిపారు. డీఈవో పగాడలమ్మ ఆదేశాల మేరకు ఫిర్యాదుదారుల సమక్షంలో విచారణ నిర్వహించామని చెప్పారు. పలు ఆరోపణలపై సమాచారం సేకరించామన్నారు. తగు చర్యలు నిమిత్తం కలెక్టర్, ఆర్‌జేడీ, డీఈవోలకు అందిస్తామని చెప్పారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

గరుగుబిల్లి, జియ్యమ్మవలస ఎంఈవో ఎన్.నాగభూషణరావుపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎస్.మురళీమోహన్‌రావు, జిల్లా అధ్యక్షుడు టి.రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఎంఈవో ఉపాధ్యాయుల నుంచి ప్రతి పనికి కొంత మొత్తాలు వసూళ్లు చేస్తున్నారని, ఎస్ఎంఎఫ్ గ్రాంట్స్, నాడు-నేడు పనుల్లో అక్రమ వసూళ్లకు పాల్పడ్డారని ఆరోపించారు. వైద్య బిల్లులకు, ఏఏఎస్ కోసం అక్రమ వసూళ్లకు పాల్పడ్డారన్నారు. విచారణ అధికారులు నిజాయితీతో వ్యవహరించి అవినీతి, అక్రమాలకు పాల్పడ్డ ఎంఈవోను సస్పెండ్ చేయాలని లేదంటే పోరాటం చేస్తామన్నారు.

క్వారీ తవ్వకాలు తాత్కాలికంగా నిలిపివేత

సీతానగరం: నిడగల్లు, ఇప్పలవలస రెవెన్యూ పరిధిలో క్వారీలను జిల్లా మైనింగ్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర శుక్రవారం పరిశీలించారు. క్వారీల నిర్వహణకు ఎటువంటి అనుమతులు లేకపోవడంతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు కాలుష్య ఇబ్బందులు ఉన్నట్లు ఆయన గుర్తించి తాత్కాలికంగా నిలిపి వేయించారు. ప్రజల సంక్షేమం, ఆరోగ్యం ప్రధానమని తెలుపుతూ అనుమతులు లేని క్వారీలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని ఎమ్మెల్యే హెచ్చరించారు. ప్రతి క్వారీ నిబంధనల మేరకు నడపాలని, చుట్టు పక్కల ప్రజలకు ఆరోగ్య సమస్యలకు తావివ్వకుండా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు.

పార్టీలకు అతీతంగా అభివృద్ధి

● ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: పార్టీలకతీతంగా మండల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ దీనమయ్య అధ్యక్షతన శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకొని మండల అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని సూచించారు. ఖరీఫ్ సీజన్‌లో సాగునీరు అందించి రైతులకు సాయం చేయాలని వ్యవసాయాధికారులకు సూచించారు. ఆశ్రమ పాఠశాలల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి విద్యార్థులను ఆదుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. ముందుగా ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఉపాధి హామీ సిబ్బంది ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రాధిక, వైస్ ఎంపీపీలు నిమ్మక శేఖర్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై విరిగిన చెట్టు కొమ్మ

● నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు.. సరఫరాకు అంతరాయం


రోడ్డు మధ్యలో విరిగిపడిన చెట్టు కొమ్మ

కురుపాం: కురుపాం శివ్వన్నపేట వెళ్లే రహదారిపై చెట్టు కొమ్మ విరిగి పడటంతో విద్యుత్ వైర్లు తెగడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. చెట్టు కొమ్మ విరిగిన వెంటనే అధికారులు స్పందించి వెంటనే తొలగించారు. దీంతో విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. దీంతో సమీపంలో ఉన్న నాలుగు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. వెంటనే విద్యుత్ శాఖ అధికారుల స్పందించినప్పటికీ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు.

ఒడిశా

మానవ అక్రమ రవాణా నివారణ కేంద్రం ప్రారంభం

రాయగడ: స్థానిక రైల్వే స్టేషన్ ప్రాంగణంలోని ఆర్‌పీఎఫ్ కార్యాలయంలో శుక్రవారం మానవ అక్రమ రవాణా యూనిట్ ఆర్‌పీఎఫ్ ఐజీ అలోక్‌బోర ప్రారంభించారు. ఈసందర్భంగా రాయగడ వచ్చిన ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. మానవ అక్రమ రవాణా నివారణకు ఈ కేంద్రం పత్యేక చర్యలు చేపట్టి, నిరంతరం నిఘా పటిష్ఠం చేస్తుందన్నారు. రైళ్లలో మానవ అక్రమ రవాణా నివారణకు నిరంతరం పనిచేస్తుందని తెలిపారు. ఎవరైనా బాధితులు ఫిర్యాదు చేసేందుకు 24 గంటలు సేవలు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాయగడ ఆర్‌పీఎఫ్ కార్యాలయ అధికారులు, మానవ హక్కుల సంఘం ప్రతినిధులు లీనా సేనాపతి, బిద్యులత హాయిక తదితరులు పాల్గొన్నారు.

సారా స్థావరాలపై దాడులు

రాయగడ: జిల్లాలో అబ్కారీ శాఖ వివిధ ప్రాంతాల్లో సారా స్థావరాలపై దాడులు చేసి, సారా బట్టీలను, ఊటలను ధ్వంసం చేశారు. జిల్లాలోని కొల్నార, ముకుందపూర్, చందిలి, కాశీపూర్ తదితర ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గోమతి బిడిక, అజిత్ కుమార్ కొరకొరియా నుంచి 2,150 లీటర్ల ఊటను, 190 లీటర్ల సారాను అబ్కారీ శాఖ పోలీసులు స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేశారు. సారా తయారు చేసినా, విక్రయించినా కేసులు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

మజ్జిగౌరి అమ్మవారికి సారె


అమ్మవారి వద్దకు సారె తీసుకుని వెళ్తున్న మహిళలు

రాయగడ: రాయగడ గ్రామదేవత బురదల పోలమ్మ, రాయగడ ప్రజల ఆరాధ్య దేవత మజ్జిగౌరి అమ్మవారికి స్థానిక నెహ్రూనగర్‌కు చెందిన మహిళలు శుక్రవారం ఆషాఢ మాసం సారెను సమర్పించారు. సుమారు 500 మంది మహిళా భక్తులు 40 రకాల పదార్థాలను తలపై పెట్టుకుని అమ్మవారి మందిరానికి చేరుకుని సారె సమర్పించారు.

ఉచిత వైద్య శిబిరం

రాయగడ: స్థానిక లయన్స్ క్లబ్‌లో శుక్రవారం మార్వాడి యువమంచ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని జిల్లా కేంద్ర ఆసుపత్రి ముఖ్య వైద్యాధికారి లాల్‌మోహన రౌత్రాయ్ ప్రారంభించారు. ఈ శిబిరంలో రోగులకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. మార్వాడి యవమంచ్ అధ్యక్షుడు వనీత్ అగర్వాల్, కార్యదర్శి శైలేష్ సింఘాల్, ఉదిత్ జైన్, సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

ఇంటర్ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ


పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

సీతానగరం: బలిజిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర శుక్రవారం పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పెంకి వేణుగోపాల్‌నాయుడు, బి.రవికుమార్, ప్రిన్సిపాల్ ఎం.జ్యోతి, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దశల వారీగా 4జీ సేవలు

గుమ్మలక్ష్మీపురం: ఉమ్మడి విజయ నగరం జిల్లాలో బీఎస్ఎన్ఎల్ దశల వారీగా 4జీ సేవలను ప్రవేశపెట్టబోతోందని, వినియోగదారులు 2జీ, 3జీ సిమ్ కార్డులను తక్షణమే 4జీకి అప్ గ్రేడ్ చేసుకోవాలని డిప్యూటీ జనరల్ మేనేజర్ దాలినాయుడు శుక్రవారం తెలిపారు. 4జీకి అప్ గ్రేడ్ చేసిన తర్వాత 2జీ, 3జీ సేవలు కూడా కొనసాగుతాయన్నారు.

బాధితురాలికి న్యాయం చేయాలి

పార్వతీపురంటౌన్: పట్టణంలోని ఓ కాలనీకి చెందిన మహిళను పెళ్లి చేసుకుంటానని మోసంచేసిన యువకుడిపై చర్యలు తీసుకుని, బాధితురాలికి న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు జీవీ రమణ డిమాండ్ చేశారు. జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని సీఐటీయూ నాయకులు శుక్రవారం పరామర్శించారు.

నిత్యావసర వస్తువుల ధరల స్థిరీకరణ

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: జిల్లాలో నిత్యావసర వస్తువుల ధరలను స్థిరీకించడానికి, మార్కెట్‌లో సామాన్య ప్రజలకు అందుబాటు ధరల్లో స్పెషల్ కౌంటర్లు ప్రారంభించామని జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కేం ద్రాల్లో కందిపప్పు కిలో రూ.160 నుంచి 150, బియ్యం (ఫైన్ స్టీం బియ్యం) కిలోకు రూ.49 నుంచి రూ.48, ఫైన్ ముడి (రా బియ్యం) కిలో రూ.48 నుంచి రూ.47 గా నిర్ణయించామన్నారు. జిల్లా వ్యాప్తంగా రైతు బజారులు, ఇతర షాపుల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్టు ఆమె పేర్కొన్నారు.

8న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నిక

వీరఘట్టం: వీరఘట్టం మేజర్ పంచాయతీ జామివారి సైట్‌లో ఈ నెల 8న జరగబోయే స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు జామి లక్ష్మీనారాయణ, కూటమి నాయకులు బల్లా హరిబాబు, జామి సింహాచలం, తూముల రమేష్, కర్రి అప్పన్న, కోట అప్పడు, కోట మురళి, కోట శంకర్, రౌతు రామకృష్ణ, ఉదా రామకృష్ణ, వినోద్, ప్రవీణ్, సింహాచలం, ఉదయ్, అచ్యుతరావు, పండు, చుక్క భార్గవ్, చరణ్, సాయి, పవన్, వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి చక్రాల కుర్చీ

పాలకొండ: పట్టణంలోని కుమ్మరి వీధికి చెందిన బండి కృష్ణకు ఒక కాలు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్, మదర్స్ లవ్ ఫౌండేషన్ మెంబర్ నంది ఉమాశంకర్, సుప్రజామహాలక్ష్మీ ఆర్థిక సాయంతో ఏరియా ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ చిరంజీవిచేతుల మీదుగా చక్రాల కుర్చీ అందించారు. ఈ కార్య క్రమంలో సోషల్ సర్వీస్ మెంబర్ నవీన్, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.